ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

డిసెంబర్ 21, 2014

హాస్యానికే చిరునామా
చార్లీ చాప్లిన్

వివిధ దేశాల్లో మెర్రీ క్రిస్మస్

బాలీవుడ్‌లో రజనీ

రజనీకాంత్ తెలియని తెలుగు వారుండరు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఆయనో సూపర్‌స్టార్ అభిమానులకు. బాలీవుడ్‌లోనూ ఆయన చెప్పకోదగిన సినిమాలే చేశారు.

శ్రీదేవి ద్విపాత్రాభినయం చేసిన 'చాల్‌బాజ్'లో రజనీ, సన్నీడియోల్ కథానాయకులు. రేఖ రజనీ కలిసి 'ఫూల్ బనే అంగారే' చేశారు. ఐశ్వర్యారాయ్ రజనీకాంత్ జంటగా 'ఎథిరన్' చేశారు. దీపికా పదుకొనే బాలీవుడ్ నటే అయినా కన్నడ చిత్రంతో సినిమారంగంలోకి ప్రవేశించింది. ఆమెతో కలిసి 'కొచ్చాడియన్'లో నటించాడు రజనీ. హేమమాలినితోనూ ఓ సినిమా చేశారు. సోనాక్షి సిన్హా, అనుష్క నటించిన 'లింగ' బాలీవుడ్‌లో రజనీ తాజా చిత్రం. సో...టాలీవుడ్డే కాదు! బాలీవుడ్‌లోనూ రజనీ సుపరిచితుడే.



పవన్ కళ్యాణ్



ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

బదిలీ(ల)లు

బదిలీ గురించి బాగా ఎవరికి తెలుస్తుంది?! ఇంకెవరికీ! ఉద్యోగులకే! భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులైతే! బదిలీ భయం వెంటాడుతూనే వుంటుంది. ఏమో ఏ క్షణంలో ఎవరికి బదిలీ అవుతుందో! ఎవరు ఎప్పుడు ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందో? రాష్ట్ర విభజన జరిగినప్పుడు బాగా చర్చనీయాంశమైన అంశాల్లో ఇదీ ఒకటి. ఇప్పటికీ ఐఎఎస్‌ల బదిలీ, అధికారుల బదిలీలపై చర్చలు సా....గుతూనే వున్నాయ్.

ఈ బదిలీలు అన్ని సౌకర్యాలు వున్న చోటికి అయితే సంతోషమే! అదే ఏ మారు మూల పల్లెకో, ఏజన్సీ ఏరియాకో అయితేనే...కష్టమ్!

బదిలీ అనే సింగిల్ కాన్సెప్ట్‌తో కార్టూనిస్టులు ఎన్ని వ్యంగ్య చిత్రాలు వేయలేదు! సినీ దర్శకులు ఎన్ని కామెడీ సీన్లు తీయలేదూ! 'మల్లీశ్వరి' (వెంకటేష్-కత్రీనా) సినిమాలో ఆఖరి వరకూ నవ్వులు పూయించిన బదిలీ ట్రాక్‌ను ఎవరు మాత్రం మర్చిపోతారు!

తాజాగా... బడా పత్రికల కార్యాలయాల్లోనూ బదిలీల మాట జోరుగానే విన్పిస్తోంది. ఈ మూల వాణ్ణి ఆ మూలకు ... ఆ మూల వాణ్ణి ఈ మూలకు విసిరేస్తున్నారు. ఉద్యోగుల బరువు దించుకోడానికి. పత్రికా నిర్వహణ ఖర్చు తగ్గించుకోడానికే ఈ బదిలీ మంత్రం పఠిస్తున్నారని వినికిడి.

ప్రభుత్వాలు, నేతలు కూడా బదిలీ జపం చేసేస్తున్నారు. కాకపోతే వీరు బదిలీ చేసేది ఉద్యోగులను కాదు. నగదును. సబ్సిడీని డబ్బు రూపంలో బదిలీ చేస్తాం. అందుకోండి! ఆనందించండి! అంటున్నారు. తాగుడుకు బానిసలైన వారికి బదిలీ పథకం బ్రహ్మాండంగానే వుంటుంది. కుటుంబ సభ్యులకే బాధ!

ప్రతిపక్షం వారు ఎప్పటికీ ప్రతిపక్షంలోనే వుండరుగా! అధికార పక్షంలోకి బదిలీ అవుతారు. అప్పుడు వాగ్దానాలు, విమర్శలు అటూఇటూ బదిలీ అవుతాయి. ఇదో నిరంతర స్రవంతి.

ఇటీవల ఆమ్యామ్యాలను సైతం బదిలీల రూపంలో అందుకుంటున్నారు. కొందరు నేతలు ప్రజల డబ్బును పెద్దలకు బదిలీ చేసేస్తారు. అవి తిరిగి పెట్టుబడుల రూపంలో వీరికే వచ్చి పడుతుంటాయి. ఇవే మళ్లా నల్ల డబ్బుగా బదిలీ అవుతుంటాయి. పరస్పర సహాయ సహకారాల బహిరంగ బదిలీ అన్నమాట.

ఈ ప్రక్రియలో ఇచ్చిపుచ్చుకునే వారిద్దరికీ లాభాలు బదిలీ కాగా... ప్రజలకు కష్టాలు బదిలీ కావడం కొసమెరుపు.

■

◆ మనలో మాట

టపా

అన్నీ ఆకట్టుకున్నాయి

'స్నేహ'లో వస్తున్న అంశాలు...వినోదాన్ని, మానసిక ప్రశాంత తను ఇస్తున్నాయి. మహారాష్ట్రలోని షాని షింగ్నపూర్ అనే గ్రామంలో ఇళ్ళకు తలుపుల్లేవ్! ఇలానే భారతదేశం అంతా ఉండాలంటే బంగారాన్ని, ధనాన్ని, వస్తువులను మట్టిగా చూడగలగాలి. కల్తీ మనస్సులు మారితే రామరాజ్యమే కదా. టమటా లోయ్ ఆరోగ్యానికి మంచివి. కొత్త పుస్తకాలు శీర్షిక పాఠకులకు కానుక గదా! కోతులకు 'విందు' చిత్రాలు–లోప్‌బురి నగరం థాయ్‌ల్యాండ్, బొమ్మల బ్రహ్మ, టీవీ టు టాలీవుడ్ చిన్నారి పెళ్ళికూతురు బాగున్నాయి. నమ్మకమ్ మరి!, వారణాసి విశేషాలు ఆకట్టుకున్నాయి. వేడివేడిగా, అల్లరి నరేష్, నవ్వుల్–పువ్వుల్ జోక్స్ నవ్వు తెప్పించాయి. మూడు జంటల ముందడుగు, పరిశుభ్రతకు పట్టం, వంద శాతం అక్షరాస్యత, ప్రేమ.. విప్లవం... అన్నీ చదివించాయి.

– కన్నెగండ్ల హరనాథ్,
నరసరావుపేట.

నాటి సమస్యలు తెలుసుకుంటున్నాం

'ప్రేమ విప్లవం' మార్క్స్ జెన్నీ ప్రేమ కథ సీరియల్ ద్వారా పద్దెనిమిదవ శతాబ్దం నాటి ప్రజల స్థితిగతులు దారిద్ర్యం, మురికివాడల ప్రజల సమస్యలు తెలుసుకొన్నాం. స్త్రీలవి ప్రత్యేక సమస్యలు. మాంచెస్టర్‌లోని మహిళలు కార్మికుల వలె తమ శరీరాలను అమ్మకానికి పెట్టడం దారిద్ర్యానికి నిదర్శనం. కార్మికవర్గం స్థితిగతులు, సామాజిక పరిస్థితులు మొదలగు ఎన్నో విషయాలను ఈ సీరియల్ ద్వారా తెలుసుకొంటున్నాం. సీరియల్‌ను పుస్తక రూపంలో తెస్తే బాగుంటుంది.

– టి.శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

...ముందడుగే

ఆడపిల్లలు వద్దనుకునేవారే ఎక్కువ. దాని వెనుక వున్న అసలు కారణాన్ని 'మూడు జంటల ముందడుగు'లో చక్కగా చెప్పారు. వరకట్నం అసలు సమస్య. అది ఇవ్వలేక అందరూ అబ్బాయిలే కావాలనుకుంటున్నారు. వరకట్న సమస్య, ఆడమగ వివక్ష, పున్నామనరకమనే నమ్మకాలు లేకపోతే ఎవ్వరూ ఆడపిల్లను వద్దనుకోరేమో! సరిగ్గా ఈ సమస్యల్లో ఒకటైన వరకట్నం, పెట్టుపోతలు, కులమత అంతరాలను ఎదిరించి పెళ్లి చేసుకున్న మూడు జంటలూ అభినందనీయులు. చక్కటి విషయం తెలిపారు.

– ఎస్.ఇందిర, నంద్యాల.

చదివించిన 'అల్లరి' కబుర్లు

ఈ వారం రంగుల పేజీల్లో చెప్పిన మూడు విషయాలు అలరించాయి. టీవీ నుంచి టాలీవుడ్‌కు వచ్చిన చిన్నమ్మల విజయగాధ నిజంగా ప్రశంసనీయం. కోతులకు విందు ఇవ్వడం నిజంగా మంచి విషయం. అలా ఒక్క థాయ్‌లాండ్‌లోనే కాక అన్ని దేశాల్లోనూ వుంటే ఎంత బాగుండు అనిపించింది. ఇక బొమ్మల బ్రహ్మ తయారు చేసిన టెర్రకోట బొమ్మలు నిజంగా ఎంతగానో ఆకట్టుకున్నాయి. లైఫ్‌సైజ్ బొమ్మలు కావడంతో వాటి ఆకర్షణ మరింత పెరిగింది. ఆదర్శగ్రామాలుగా వెలుగొందుతున్న పది పల్లెల గురించి ఇవ్వడం బావుంది. నిజంగా మన దేశంలోని అన్ని గ్రామాలు అలా అభివృద్ధి చెందితే ఎంత బాగుంటుంది?! అల్లరి నరేష్ చెప్పిన చిన్న చిన్న విషయాలు చాలా ఆసక్తికరంగా చదివించాయి.

– బి. పాండురంగారావు, విశాఖ.

ఈ సంచికలో....

వివిధ దేశాల్లో ... మెర్రీ క్రిస్మస్

కవర్‌స్టోరీ 14

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పెద్ద పండుగ క్రిస్మస్. డిసెంబర్ నెల ప్రవేశించిందంటే చాలు! క్రిస్మస్ వేడుకల కోలాహలం మొదలౌతుంది. దాదాపు అన్ని దేశాలలో క్రిస్మస్ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. క్రైస్తవులు అల్ప సంఖ్యాకులుగా నివసిస్తున్న దేశాలలో కూడా మత వైషమ్యాలు లేకుండా జరుపుకుంటారు.

జ్ఞాపకం 3
హాస్యానికే చిరునామా

చూద్దామా 4
భారీ బౌద్ధాలయం బోరో బుడోర్

వింతలోకం 5
కోళ్ల హోటల్

కథ 6
రాధకు నీవేరా ప్రాణం

సినిమా కబుర్లు 8
'అతను' అలా వుండాలి

నివాళి 10
మర్చిపోలేని సుస్వరం 'మహమ్మద్ రఫీ'

నవ్వుల్ - పువ్వుల్ 11

సమ్‌థింగ్ స్పెషల్ 17
పెట్టుబడిపై 760 రెట్ల ఆదాయం !

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
క్రిస్'మస్ట్' కేక్

బాలనేస్తాలు 22
నిజమైన స్నేహం

కొత్త పుస్తకాలు 24
కాలాన్ని వెనకేసిన మనిషి

క్రేజీ 12
దొంగ... దొంగ...

◆ జ్ఞాపకం

హాస్యానికి చిరునామా

చార్లీ చాప్లిన్ పేరు వినగానే...వదులైన సంచుల్లాంటి పంట్లాం. ఇరుకైనా కోటు, పాదాలకు మించిన పెద్ద బూట్లు, నెత్తిన చిన్న టోపీ, ఫ్రెంచ్ కట్ మీసాలు, చేతిలో వంకీ కర్ర, అమాయకపు చూపులు వంకట టింకర నడకలతో కడుపుబ్బ నవ్వించే హావభావాలను ప్రదర్శించే వ్యక్తి మన మనోఫలకంపై మెదులుతాడు. ఒకప్పుడు హాలీవుడ్‌ను ఏలిన వేషం అది. ప్రపంచం అంతటా నవ్వుల జల్లులు కురిపించింది. నాడే కాదు. నేటికీ సజీవమే. హాస్యానికే కేరాఫ్ అడ్రస్‌గా నిల్చిపోయిన చార్లీ చాప్లిన్ వర్ధంతి (డిసెంబర్ 25) సందర్భంగా కొన్ని జ్ఞాపకాలు...

చార్లీ చాప్లిన్ తల్లిదండ్రులిద్దరూ నాటకాలు వేసేవారు. చిన్నతనంలోనే తల్లితోపాటే చాప్లిన్ నాటకాలకు వెళ్లేవాడు. ఒకరోజు తల్లి నాటకం మధ్యలో పాట పాడుతుండగా గొంతు జీరపోయింది. ప్రేక్షకులు ఎగతాళిగా గోల చేయనారంభించారు. ఎంత ప్రయత్నించినా తల్లి గొంతు సరిగాకపోయేసరికి ఆమె స్టేజీ వదిలి వెనక్కి వచ్చేసింది. ఆమె మొహంలో తీవ్రమైన ఆవేదన గమనించాడు చాప్లిన్. ఇంతలో స్టేజీ మేనేజర్ చాప్లిన్ చేత స్టేజీ మీద ప్రదర్శన ఇప్పించాలని తల్లిని కోరాడు. అంతకు ముందు తల్లి స్నేహితుల ఎదుట చాప్లిన్ చిలిపిగా నటించడం మేనేజర్ చూసి వున్నాడు. అందువల్ల చాప్లిన్‌ని స్టేజీ మీదకు వచ్చి ప్రేక్షకులకు రెండు పరిచయ వాక్యాలు చెప్పి వెళ్లిపోయాడు.

అయిదేళ్ల చాప్లిన్, వెంటనే అంతమంది ప్రేక్షకుల ఎదుట ... తనకు బాగా తెలిసిన పాటనొకదాన్ని అందుకున్నాడు. గొడవ స్థానే కొద్దికొద్దిగా నవ్వులు ప్రారంభమయ్యాయి. కొద్ది సేపటికి స్టేజీ మీద చిల్లర నాణాల వర్షం కురవడం మొదలైంది. చాప్లిన్ అకస్మాత్తుగా పాట ఆపేశాడు. డబ్బులు ఏరుకున్నాకే మిగిలిన పాట పాడతానన్నాడు కొంటెగా. దాంతో హాలంతా నవ్వులతో నిండిపోయింది.

ఎప్పటికైనా నటుడు కావాలన్నదే లక్ష్యం. తండ్రి మరణం, తల్లి పిచ్చాసుపత్రి పాలు కావడంతో ఒంటరై రకరకాల పనులు చేస్తూ పొట్ట పోసుకునేవాడు. ఆ క్రమంలోనే 'బ్లాక్ మోర్' నాటక సమాజం వారికి చాప్లిన్ దరఖాస్తు పెట్టుకున్నాడు. కొన్నాళ్లకి అక్కడి నుంచి ఆహ్వానం వచ్చింది. 'షెర్లాక్ హోమ్స్' నాటకంలో చాప్లిన్‌కి ఒక పాత్ర ఇచ్చారు. అయితే దానికి కాస్త వయసులో వున్న యువకుడు కావాలి. చాప్లిన్‌కి అప్పుడు పన్నెండున్నరేళ్లు. అయినా పద్నాలుగేళ్లని అబద్ధం చెప్పాడు. 40 వారాల పాటు వారానికి రెండు పౌండ్ల జీతానికి చాప్లిన్ ఆ నాటక సమాజంలో కుదిరాడు. అది చాప్లిన్ జీవితంలో ఒక గొప్ప మలుపు.

◆ ◆ ◆

ఆ రోజుల్లో ఫ్రెడ్ కార్నో అనే ఆసామి ఇంగ్లండ్‌లో పెద్ద నాటక సమాజం నడుపుతుండేవాడు. చాప్లిన్ ఆ సమాజంలో చేరి అనేక నాటకాలు వేశాడు. కార్నో కంపెనీకి అమెరికాలో కూడా శాఖలున్నాయి. వారికి అక్కడ ఒక హాస్య నటుడు అవసరమై చాప్లిన్‌ని అమెరికా పిలిపించాడు. ఇంగ్లండ్‌లోని ఒంటరితనం నుంచి దూరంగా పోవాలనుకుంటున్న చాప్లిన్‌కి అమెరికా యాత్ర ఎంతో ఆనందం కలిగించింది. అమెరికన్ ప్రేక్షకులకు ఆ నాటకం అంతగా రుచించకపోయినా...చాప్లిన్ నటనను మాత్రం పత్రికలు ప్రశంసించాయి. దాంతో చాప్లిన్ తిరిగి ఇంగ్లండ్ వచ్చినప్పటికీ మళ్లీ అమెరికా వెళ్లాలన్న కోరిక ఆయనలో బలంగా నాటుకుంది.

◆ ◆ ◆

కొద్ది రోజులకే చాప్లిన్‌కి అమెరికా వెళ్లే అవకాశం లభించింది. కార్నో నాటక బృందంతో అమెరికా వెళ్లాడు. అలా నాటకాలు వేస్తుండగానే 'కీస్టోన్ కాప్స్' కంపెనీ నుంచి చాప్లిన్‌కు పిలుపు వచ్చింది. వారానికి 150 డాలర్ల జీతానికి ఏడాది కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. అది అతని జీవితంలో ఊహించని జీతం. అంతకుముందు నాటక సమాజాల్లో వారానికి 75 డాలర్లు ఇచ్చేవారు. ఇప్పుడు జీతం రెట్టింపయింది. లాస్ ఏంజెల్స్‌లోని హాలీవుడ్ అప్పుడప్పుడే ఒక రూపాన్ని సంతరించుకుంటోంది. చాప్లిన్ ఆ కొత్త జీవితంలోకి ప్రవేశించాడు. తొమ్మిది రోజుల పాటు కీస్టోన్ స్టూడియోకి వెళ్లడం... తిరిగి ట్రామ్ మీద గదికి రావడం. చాప్లిన్‌కి సినిమాలో పాత్ర మాత్రం ఇవ్వలేదు. వారం చివర మాత్రం ముందుగా మాట్లాడుకున్న పద్ధతుల్లో జీతం మాత్రం అందింది. సినిమా పాత్ర రాకపోవడం చాప్లిన్‌ని బాధించింది. 'కీస్టోన్ కాప్స్' తీసే సినిమాల దర్శకనిర్మాత మాక్ సెన్నెట్ దగ్గరకెళ్లి ఇదే చెప్పుకున్నాడు. ఆయన ఏదో ఒక మేకప్ వేసుకుని కెమెరా ముందు నిలబడమన్నాడు సెన్నెట్.

వదులైన సంచుల్లాంటి పంట్లాం. బిగువైన పొట్టి కోటు, తలకు చాలీచాలని చిన్న టోపీ, పాదాలకు మించిన పెద్ద బూట్లు చేతిలో వంకీ కర్ర, ఫ్రెంచ్ కట్ మీసాలతో ప్రత్యక్షమైన చాప్లిన్‌ను చూసి మాక్ సెన్నెట్‌తో పాటు అక్కడున్న వారంతా ఫక్కున నవ్వారు. తర్వాత సెట్ మీదకు వెళ్లి ఏదో ఒకటి చేసి చూపించమన్నాడు సెన్నెట్. చాప్లిన్ అప్పటికప్పుడు ఆలోచించి ఒక హోటల్ అతిథి పాత్ర చేశాడు. నిజానికి తల దాచుకోడానికి నీడ వెదుకుతున్న అతను ఒక దేశ దిమ్మరి. హోటల్‌లోకి ప్రవేశించగానే ఒక మహిళ కాలు తొక్కాడు. వెంటనే వెనక్కి తిరిగి టోపీ ఒక చేత్తో పైకెత్తి తప్పయింది క్షమించమన్నట్టు అభివాదం చేశాడు. వెంటనే అటు తిరిగి మరో వ్యక్తి కాలు తొక్కాడు. అప్పుడూ అలాగే టోపీ పైకెత్తాడు. సెట్ మీద చాప్లిన్ చేస్తున్న ఈ చేష్టలకు కెమెరా వెనుక చేరినవారంతా పగలబడి నవ్వనారంభించారు.అది చూసి ఆ చుట్టు పక్కల సెట్‌లలో పని చేస్తున్న వారంతా అక్కడకు చేరారు. అదే దేశదిమ్మరి (ట్రాంప్) పాత్ర చాప్లిన్‌కు శాశ్వతమైపోయింది. ఒక రకంగా చెప్పాలంటే చాప్లిన్‌కు మారో పేరుగా మారిపోయింది. అన్ని సినిమాల్లోనూ ఆ పాత్రే పోషించాడు. అంతకుముందున్న రంగస్థల నాటకానుభవం, ఆయనలోని సృజనాత్మకత కారణంగా కొద్ది కాలంలోనే సినిమా రంగంలో మేటి నటుడిగా రాణించాడు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆయన చిత్రాల్లో ... 'ఎ వుమన్ ఆఫ్ పారిస్, ది గోల్డ్ రష్, ది సర్కస్, సిటీ లైట్స్, మోడరన్‌టైమ్స్, ది గ్రేట్ డిక్టేటర్, లైమ్‌లైట్, ది కింగ్ ఇన్ న్యూయార్క్...' కొన్ని మాత్రమే. ఒకప్పుడు పస్తుల బాధ నుంచి తప్పుకోడానికి అనాథ శరణాలయాన్ని ఆశ్రయించిన చాప్లిన్ తర్వాత కోట్లకు పడగలెత్తాడు. హాలీవుడ్ స్టార్‌గా ప్రపంచ ప్రఖ్యాతుడయ్యాడు. సామాన్య ప్రజలకీ, రాజకీయ శాస్త్ర సాంస్కృతిక రంగాలలో ప్రఖ్యాతిగాంచిన అనేక మందికి చాప్లిన్ అభిమాన నటుడయ్యాడు. ◆

భారీ బౌద్ధాలయం బోరో బుదోర్

బుద్ధుడు, బౌద్ధారామాలు...అనగానే చైనా, జపాన్, థాయ్‌ల్యాండ్ గుర్తొస్తాయి. మరైతే ప్రపంచంలోకెల్లా అతి పెద్దదయిన బౌద్ధ దేవాలయం ఎక్కడ వుంది? అనడిగితే మాత్రం జావా ద్వీపం పేరు చెప్పకోవాల్సిందే. ఈ దీవి ఇండొనేషియాలో వుంది. ఇక్కడి ప్రజలలో అధిక సంఖ్యాకులు ముస్లిములే. అయినప్పటికీ ప్రపంచంలోకెల్లా బ్రహ్మాండమైన బుద్ధ దేవాలయం ఇక్కడే వుంది. మధ్య జావాలో ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టు అనిపించే అందమైన లోయ ఒకటి కనిపిస్తుంది. అందులో ఠీవీగా నిలబడిన అగ్నిపర్వతాలు దర్శనమిస్తాయి. వాటి ముంగిట నిర్మించిన ఆలయమే "బోరో బుదోర్".

పర్వత చక్రవర్తులుగా ప్రసిద్ధిచెందిన శైలేంద్ర వంశానికి చెందిన రాజులు ఈ ఆలయాన్ని నిర్మించారు. బ్రహ్మాండమైన ఈ కట్టడ నిర్మాణం 750 – 850 సంవత్సరాల మధ్య కాలంలో జరిగినట్లు చరిత్రకారుల అంచనా. బోరో బుదోర్ ఆలయాన్ని చూసిన వారెవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. దాని ఆకారం అలా వుంటుంది మరి. ఈ ఆలయంలోని స్థూపాన్ని నిర్మించడానికే 60,000 క్యూబిక్ మీటర్ల రాయి అవసరమైంది. ఎటువంటి లోపాలు లేని అంత పెద్ద శిలలను ఆ రోజుల్లో ఆ ప్రదేశానికి ఎలా చేర్చారా అనేది ఈ నాటికీ ఊహకందదు. కొన్ని వందల మంది శిల్పులు అహోరాత్రాలు శ్రమపడి అద్భుతమైన ఈ స్థూపాన్ని సృష్టించారు. ఆలయ గోపురాన్ని ఆరు అంతస్థులుగా నిర్మించారు. ప్రతి అంతస్థును అపూర్వమైన శిల్పకళాశోభతో మెరిసిపోతూ వుంటుంది. ఘంటాకారంలో వున్న చిన్నచిన్న మందిరాలలో కూర్చునివున్న బుద్ధ విగ్రహాలు ఈ అంతస్థులలో అనేకం వున్నాయి. 27 వేల చదరపు అడుగుల కైవారంలో నిర్మించిన కింది గ్యాలరీలన్నీ బుద్ధుని జీవితానికి సంబంధించిన శిల్ప దృశ్యాలతో మనోహరంగా శోభిస్తూ వుంటాయి. ఆలయ ప్రాంగణంలోనూ కుడ్యాలపైనా ఇంకా ఇతర చోట్ల మొత్తం 470కి పైగా బుద్ధ ప్రతిమలు బోరో బుదోర్‌లో వున్నాయి. నాగరికత, జన సమ్మర్దం బోరోబుదోర్ వైపు విస్తరించకపోవడంతో ఈ ప్రాంతం ఇంకా పచ్చదనంతో పరవళ్లు తొక్కుతుంటుంది. ఆలయ మధ్యభాగంలో వున్న మహాస్థూపం ఆకాశాన్ని తాకుతోందా అనిపిస్తుంది.

ఒకసారి జావాలో ప్రజ్వరిల్లిన అగ్నిపర్వతాల ప్రభావం బోరోబుదోర్ ఆలయం మీద కూడా పడింది. అగ్ని పర్వతాలు విరజిమ్మిన భస్మరాశి ఈ ఆలయం కప్పేసింది. అలా బూడిద కుప్పల కింద కొన్ని శతాబ్దాలపాటు వుండిపోయింది. 1814వ సంవత్సరంలో అప్పటి జావా గవర్నరు సర్ స్టాంఫోర్డ్ రాఫిల్స్ ఆలయ ఉద్ధరణకు పూనుకుని తవ్వకాలకు ఆజ్ఞాపించాడు. భస్మ రాసులను తవ్వి పోసి ఆలయాన్ని వెలికితీశారు. తర్వాత 1907వ సంవత్సరంలోఅప్పట్లో జావాను పరిపాలించిన డచ్‌వారు ఆలయ పునర్నిర్మాణానికి పూనుకుని చాలా మరమ్మతులు చేయించారు. కానీ ఆలయానికి అంతులేని అపకారాన్ని కూడా చేశారు. అప్పట్లో జావా సందర్శించిన థాయ్‌లాండ్ చక్రవర్తి మెహర్బానీ కోసం ఆయనకు బహుమానంగా బోరోబుదోర్‌లోని అమూల్యమైన శిల్పాలను అనేకం సమర్పించుకున్నారు అప్పటి డచ్ ప్రభుత్వం వారు. దాదాపు ఎనిమిది బండ్ల నిండుగా ఆలయ శిల్పాలను, అద్భుతమైన బుద్ధ విగ్రహాలను థాయ్‌లాండ్‌కు తరలించారు. అవన్నీ కూడా యథాతథంగానే వుండివుంటే ఆలయ అత్యంతాద్భుత సౌందర్యంతో నిండివుండేది. వీక్షించడానికి వేయి కనులున్నా చాలవనే చెప్పకోవచ్చు. అయినా ఇప్పటికీ బ్రహ్మాండమైన తన ఆకారంతో అద్వితీయ శిల్పకళా సౌందర్యంతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తూనే వుంది బోరోబుదోర్ బుద్ధదేవాలయం.

ఈ దేవాలయంలోకి ప్రవేశించేముందే భక్తులకు మరి రెండు ఆలయాలు దర్శనమిస్తాయి. ముందు ఈ ఆలయాలను సందర్శించిన తర్వాతే బోరో బుదోర్ ఆలయంలోకి వెళ్లడం ఆచారం. ఈ రెండు ఆలయాలలో మొదటిది మెండట్ ఆలయం. ఇది కూడా బుద్ధుని ఆలయమే. ఇందులో కూర్చొనివున్న బ్రహ్మాండమైన బుద్ధదేవుని విగ్రహం వుంది. ఈ విగ్రహం ప్రత్యేకత ఏమిటంటే ఈ బుద్ధుడు మామూలు ఇతర బుద్ధవిగ్రహాలలో మాదిరిగా పద్మాసనం వేసుకుని నిమీలిత నేత్రాలతో కూర్చొని వుండడు. మామూలుగా కూర్చుని వున్నట్లు వుంటాడు. బోరో బుదోర్ ఆలయంలోకి వెళ్లే ముందు భక్తులు మెండట్ బుద్ధుణ్ణి అర్చించిన తర్వాతే ముందుకు వెళతారు. మెండట్ తర్వాత కాండీపవాన్ అనే గుడి కనిపిస్తుంది. ఇది ధనాధిపతి అయిన కుబేరుని గుడి. ఈ గుళ్లో కొలువుతీరిన స్వామి కుబేరుడే. బౌద్ధులు కుబేరుణ్ణి అదృష్టదేవతగా భావించి అర్చిస్తూ వుంటారు. ఈ దేవాలయాల వల్ల కూడా బోరో బుదోర్ ఆలయం యొక్క అందం ప్రవిత్రతా ద్విగుణీకృతమై వుంటాయి. ఆ కారణంగానే ఈ ఆలయ సముదాయాన్ని సందర్శించడానికి విదేశాల నుండి కూడా భక్తులు జావా ద్వీపం వస్తుంటారు.

జావా చాలా అందమైన ద్వీపం. చేతి నిండా డబ్బు, మనసు నిండా ఉత్సాహం వుండాలే కానీ ఇక్కడికి చాలా తేలికగా చేరుకోవచ్చు. ఇక్కడికి అడుగు పెట్టిన తర్వాత ఎక్కడికయినా అతి సౌకర్యంగా బస్సులలో ప్రయాణించవచ్చు. రైళ్ల సౌకర్యం కూడా వుంది. ◆

సిగరెట్లతో సింగర్ సిత్రం

ఆర్టిస్టులకు రకరకాల ఉపాయాలు వస్తుంటాయి. ఎలా? అంటే సమాధానం చెప్పడం కూసింత కష్టమే. వస్తుంటాయంతే. జింక్స్ కస్ట్ ఆర్టిస్టు వున్నాడా! ఆయన బుర్రలో కూడా పాదరసం లాంటి ఐడియా ఒకటి పుట్టేసింది. సిగరెట్లతో చిత్రాన్ని తయారుచేయొచ్చుకదా అనుకున్నాడు. చేసేశాడు. వావ్! సిగరెట్లతోనా! అనిపిస్తుంది మనలాంటి సామాన్యులకు. మరి...టూత్ పిక్స్, పెన్సిళ్ళు, చాక్లెట్లు, బిస్కెట్లతో బొమ్మలు చేయగాలేంది సిగరెట్లతో ఎందుకు చేయలేం అనుకున్నాడో ఏమో చేసేశాడు. ఇదిగో

ఇప్పుడు ఇక్కడ కనిపిస్తోంది అదే. బొమ్మలో వున్నది ఫ్రెంచి గాయకుడు సెర్జ్ గెయిన్స్‌బర్గ్. అందుకుగాను మన స్విట్జర్లాండ్ ఆర్టిస్టు 20,000లకు పైగా సిగరెట్లను ఉపయోగించాడు. సరే. చేస్తే చేశాడు. ఇప్పుడు ఆయన బొమ్మ చేయడంతో ఆంతర్యం ఏవిటీ? అంటే ...పారిస్‌లో వున్న గొప్ప గాయకులు, గేయ రచయితలు, కళాకారుల్లో గెయిన్స్ బర్గ్ ఒకరు. ఆయన పుట్టిందీ చనిపోయిందీ పారిస్‌లోనే. పైగా ఆయన చనిపోయి ఇప్పటికి 20 సంవత్సరాలపైనే అయింది. ఆ సందర్భంగా అభిమానులు తమ దగ్గరున్న గెయిన్స్ అరుదైన ఫొటోలను, సంతకాలను ప్రదర్శిస్తున్నారు. సరిగ్గా ఇప్పుడే తను కూడా ఏదైనా ప్రత్యేకంగా చేయాలనుకున్నాడు. తను మూడేళ్లగా సేకరిస్తున్న సిగరెట్ పీకలతో గెయిన్స్ చిత్రం చేసేశాడు. ఇప్పుడది పది మందీ చూసేలా ప్రదర్శన కూడా పెట్టాడు. అదే మన ముందున్న చిత్రరాజం.

ఎలుగు యోగా

ఉదయాన్నే పార్కుకెళితే యోగా చేసేవారెంతో మంది మనకు దర్శనమిస్తారు. అదే ఫిన్‌లాండ్‌లోని అటారి జూ కెళితే...! మీకు ఓ అద్భుత దృశ్యం కనిపిస్తుంది. తర్వాత నోటెంట మాట రావడానికి చాలా సేపు పడుతుందనుకోండి. ఇంతకీ ఆ అద్భుత దృశ్యకావ్యం ఏంటంటారా! అక్కడ ఓ ఆడ ఎలుగుబంటి ప్రశాంతంగా చెట్టు కింద కూర్చుని యోగా చేస్తుంటుంది. ఈ ఫొటోలు చూశాక కూడా అనుమానం తీరలేదా! రెండు చేతులతో రెండు కాలి బొటన వేళ్ల పట్టుకొని 'వి' ఆకారంలో పెడుతుంది. కాసేపయ్యాక మెల్లగా కాళ్లను యథాస్థానంలోకి తీసుకొస్తుంది. నిదానంగా గాలి పీల్చుకుంటుంది. తర్వాత రెండు కాళ్లనూ దూరంగా పెట్టి చేతులను నేలకు ఆన్చి వుంచుతుంది. ఇలా ప్రతి రోజూ 15 నిముషాల పాటు రకరకాల యోగాసనాలు వేస్తుంది. దీనిని చూడ్డానికి సందర్శకులు తెగ ఎగబడుతున్నారట. ఇవన్నీ చదువుతుంటే మనకే దాన్ని చూడాలనిపించినా ఆశ్చర్యం లేదు.

ఖరీదైన మంచం

ఆ మంచంమీద కునుకు తీయాలంటే పెట్టి పుట్టాలండోయ్! ఏంటట అంత ప్రత్యేకత అంటారేమో! చాలానే వుంది. దీని ఖరీదే 4 మిలియన్ పౌండ్లు. ధర వింటేనే కళ్లు తిరుగుతున్నాయికదూ. అది సరే...ఇంత ఖరీదు పెట్టడానికి దానికి బంగారం మెత్తారా! వజ్రాలు పొదిగారా!! అంటారేమో? మీ అనుమానం నిజమే. ఈ మంచం తయారీలో అవన్నీ ఉపయోగించారు. ఇంకా ఇటలీ సిల్కు కూడా వాడారు. అంతేకాదండోయ్! మంచం తయారీకి వాడిన కలప కూడా చాలా ఖరీదైనది. వెరసి...అంత రేటు పలుకుతోంది. దీన్ని 39 ఏళ్ల లివర్‌పుడ్లిన్ తయారుచేశాడు. ఇదే కాదండోయ్! దీనితోపాటు మరోటి కూడా చేశాడు. దాన్ని ఓ ఇటలీ వ్యాపారవేత్త కొనుక్కొని హాయిగా కునుకు తీసేస్తున్నాడు. ఇప్పుడీ మంచాన్ని ఎవరు కొనుక్కుంటారో ఏమో? చూద్దాం!

కోళ్ల హోటల్

మీరు చాలా రకాల హోటళ్లను చూసి వుంటారు. వాటి గురించి కథలు కథలుగా విని వుంటారు. కానీ ఖచ్చితంగా ఇప్పుడు చెప్పుకోబోయే లాంటి దాన్ని గురించి మాత్రం విని వుండరు. అవునండీ! కోళ్ల హోటల్ చూశారా మీరెప్పుడైనా. జోక్ కాదు! కోళ్ల హోటల్ వుంది. ఎక్కడనుకుంటున్నారు! హెల్‌స్టన్‌లో. ప్రపంచంలోనే తొలిసారిగా కోళ్లకోసం ప్రత్యేకంగా పెట్టిన హోటల్ ఇది. 31 ఏళ్ల డేవిడ్ రాబర్ట్స్‌కు ఈ వినూత్న ఆలోచన వచ్చింది. ఇళ్లల్లో కోళ్లంటే రెండురోజులు బయటికి పోవడానికి వుండదు. వాటికి తిండి పెట్టాలి. నీళ్లు పట్టాలి. రాత్రుళ్లు జాగ్రత్తగా బుట్ట కింద పెట్టాలి. అవి పెట్టిన గుడ్లు సేకరించాలి. ఇన్ని తతంగాలుంటాయి.

అందుకే ఆ సమస్యకు పరిష్కారంగానే ఈ హోటల్‌ను ఏర్పాటు చేశాడు డేవిడ్. క్రిస్మమస్ సీజన్‌లో హోటల్ నిండిపోతుంది. కస్టమర్లను (కోళ్లను) జాగ్రత్తగా చూసుకోవడమే ఇక్కడి ఉద్యోగుల పని. ఉదయాన్నే బఫే తరహా అల్పాహారం. స్థానికంగా లభించే వాటితో మధ్యాహ్నం, రాత్రి భోజనం వుంటుంది. అదీ నాలుగ్గోడల మధ్య కాదు! ఎంచక్కా చల్లగాలి ఆస్వాదిస్తూ ఆరుబయట. ఇలా కోడి వుండడానికిచ్చిన గూడు కోసం 2 పౌండ్లు, కోడికి పెట్టే తిండి, పర్యవేక్షణకోసం 75 పెన్స్ వసూలు చేస్తారు.

రాధకు నీవేరా ప్రాణం

విడదల సాంబశివరావు
9866400059

హరి హైదరాబాద్ "ఇన్ఫోసిస్" కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ . అదే సంస్థలో పనిచేస్తున్న అనిల్‌కుమార్ బెంగుళూరు నుండి హైదరాబాద్ ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. కాలక్రమంలో హరికిరణ్, అనిల్‌కుమార్ ఇద్దరూ మంచి స్నేహితులుగా కలిసిపోయారు. ఈ సమయంలోనే కంపెనీ పనిమీద ఇద్దరినీ అమెరికా పంపించింది ఇన్ఫోసిస్ యాజమాన్యం. ఆరునెలల పాటు కాలిఫోర్నియా ఆఫీసులో కలిసి పనిచేయడం, ఒకే ఇంట్లో కలిసి వుండటం కారణంగా వీరి స్నేహం బాగా బలపడింది. అమెరికా నుండి హైదరాబాద్ వచ్చిన తర్వాత ఇద్దరూ ఒకే ఫ్లాట్‌లో వుండటం ప్రారంభించారు. 30 సంవత్సరాలు పై బడుతున్నా ఇద్దరూ బ్రహ్మచారులుగానే జీవితాన్ని గడుపుతున్నారు. కలిసిఉన్నప్పటికీ ఒకరి వ్యక్తిగత విషయాలు మరొకరు తెలుసుకోవడం కానీ, తెలుసుకోవాలన్న ఆసక్తిగానీ ఇద్దరిలోలేదు. అనిల్ మృదు స్వభావి. హరి మాత్రం విజ్ఞతకు, ధైర్యానికి, సాహసానికి ప్రతి రూపంగా స్థితప్రజ్ఞుడిలా కనిపిస్తాడు.

ఆ రోజు రాత్రి 10గంటల సమయంలో ఇద్దరూ హాలులో లాప్‌టాప్స్ ముందుపెట్టుకొని సీరియస్‌గా పనిచేసుకుంటున్న వేళ " ఆ...ఆ...ఆ... రాధకు నీవేరా ప్రాణం...నారాధకు నీవేరా ప్రాణం" పాట హరికిరణ్ లాప్‌టాప్‌లోని మ్యూజిక్ ప్లేయర్ నుండి రావడం ప్రారంభమైంది.

ఉలిక్కిపడ్డాడు అనిల్‌కుమార్ . సీరియస్‌గా హరికిరణ్ వైపు చూశాడు. అదే సమయంలో హరి కూడా అనిల్ వైపు చూశాడు. అనిల్ ముఖంలో క్షణ క్షణానికి మారుతోన్న భావాలను హరికిరణ్ దీక్షగా గమనిస్తున్నాడు. ఆ పాటను, హరి చూపులను తట్టుకోలేకపోయాడు అనిల్‌కుమార్.

"స్టాపిట్ హరి.....! స్టాపిట్....!!" పెద్దగా అరిచాడు. తాపీగా స్పీకర్ ఆఫ్ చేశాడు హరికిరణ్. లేచి అనిల్ దగ్గరకు వచ్చాడు. అతని ముఖంలోనికి సూటిగా చూస్తూ అడిగాడు.

" ఏమైంది అనిల్ ! పాట బాగుందికదా . ఏందుకు వినలేకపోతున్నావు. "

ఒక్క క్షణం ఖంగుతిన్నాడు..... అనిల్. అయినా తాపీగా సమాధానం చెప్పాడు.

" నాకు కొంచెం తలనొప్పిగా ఉంది. అంతకు మించి మరేం లేదు "

"నువ్వు అబద్ధం చెబుతున్నావు "

"లేదు.... నేను అబద్ధం చెప్పడం లేదు." అసహనంగా అన్నాడు అనిల్.

"నూరుశాతం నువ్వు అబద్ధం చెబుతున్నావు అనిల్. మనసులో ఏదో ఉందని నీ ముఖ కవళికలే చెబుతున్నాయి " .

తాపీగా అడిగాడు హరికిరణ్.

అనిల్ దీర్ఘాలోచనలో పడ్డాడు. "చూడు మిత్రమా! బాధ పంచుకుంటే తగ్గుతుంది" అంటూ అనిల్ భుజంపై చేయి వేశాడు హరి.

క్షణంపాటు హరి కళ్ళల్లోకి చూశాడు అనిల్. ఆ కళ్లలో నీకు నేనున్నానే భావం కనిపిస్తోంది. ఎన్నో సంవత్సరాలుగా మనసు అట్టడుగు పొరల్లో దాచుకున్న అపూరూపమైన తన ప్రేమకథను తన స్నేహితుడితో పంచుకోవాలని మనసు తహతహలాడుతోంది.

◆ ◆ ◆

విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం. జూనియర్స్ సీనియర్స్‌కి వీడ్కోలు పలికే పండుగ కార్యక్రమం. ఈ ఫేర్‌వెల్ కార్యక్రమంలో నాల్గవ సంవత్సరం విద్యార్థిని శోభనను వేదిక మీదకు ఆహ్వానించాడు ప్రిన్సిపాల్. చిరునవ్వుతో మయూరంలా స్టేజి పైకి వెళ్ళిన శోభన ముకుళిత హస్తాలతో అందరిని పలకరించి మైకు ముందుకెళ్ళింది.

" ఆ(.....ఆ(......ఆ(.......రాధకు నీవేర ప్రాణం...నీ రాధకు నీవేర ప్రాణం... రాధా హృదయం మాధవ నిలయ ॥రాధా హృదయం॥ ॥ రాధకు ॥ అంటూ

గానం ఆలాపించడం ప్రారంభించింది మొదలు పాట పూర్తిగా ముగిసే వరకూ ఆమె కళ్ళు ప్రేక్షక విద్యార్థుల్లో మొదటివరుసలో కూర్చున్న అనిల్‌నే చూస్తున్నాయి. ఆమె గుండెలోతుల్లో ప్రారంభమైన భావోద్వేగం పెదాలపై రాగ రంజితమై పాటగా ప్రవహించి అతని హృదయాన్ని తాకింది. "అతనికి తెలుసు శోభన తనను గాఢంగా ప్రేమిస్తోందని. కానీ..... ఈనాడే తెలిసింది ఆమె తనను ప్రేమించడంలేదు....ఆరాధిస్తోందని !

ఆ మరునాడు ఇద్దరూ కలుసుకున్న సమయంలో....

"శోభనా...నిన్న నువ్వు పాటపాడే సమయంలో నీ కళ్ళు నన్నే చూస్తున్నాయి.....ఎందుకు ?",

"నిండు మనసుతో ప్రేమించిన యువతి తన ప్రేమను ధైర్యంగానే వెల్లడిస్తుంది. ప్రేమను వ్యక్తం చేసే సమయంలో భయానికి తావుండకూడదు". అంటూ తన అభిప్రాయాన్ని

చెప్పింది శోభన.

"మన ప్రేమలో ఎన్ని అవాంతరాలు వచ్చినా, ధైర్యంగా ఎదుర్కుంటావా శోభనా?" అమాయకంగా ప్రశ్నించాడు అనిల్.

"తప్పకుండా, నీకోసం అందరినీ, అన్నింటినీ ఒదులుకుంటాన" ని.. స్థిరంగా చెప్పింది శోభన. అప్పుడే ఆమె కన్నుల వైపు చుశాడు అనిల్....... ఆ కళ్ళలో సన్నని నీటి పొర కదలాడింది.

◆ ◆ ◆

కృష్ణాజిల్లా కంకిపాడు గ్రామంలో నూటయాభై ఎకరాల భూస్వామి వాసిరెడ్డి రాజగోపాలరావు నాయుడు కూతురు శోభన. కంకిపాడు విజయవాడ నగరానికి దగ్గరగా వుండటం వలన ఆధునిక నాగరికత అక్కడి ప్రజల జీవన విధానంలో కొట్టొచ్చినట్లు కన్పిస్తూ వుంటుంది. అదే సమయంలో పచ్చని పంటచేల మధ్య అభివృద్ధి చెందుతోన్న పెద్ద గ్రామం. అందుకే పల్లెటూరు సాంప్రదాయాలు, వాతావరణం గుడా అక్కడి ప్రజలదైనందిన జీవితంలో ఓ భాగమైపోయాయి.

పేరు ప్రతిష్ఠలు కలిగిన సాంప్రదాయ కుటుంబం వాసిరెడ్డి రాజగోపాలరావు నాయుడు గారిది. వారి ఏకైక పుత్రిక శోభన. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతోంది. నాయుడిగారి వ్యవసాయభూములకు సంబంధించిన విషయాలను చూస్తూ ఆయనకు నమ్మినబంటులా వెన్నంటే ఉండే వ్యక్తి విష్ణుమొలకల రంగారావు.

రంగారావు కుమారుడే అనిల్‌కుమార్. బాల్యం నుండి ఒకే చోట పెరగటం వలనేమో అనిల్, శోభనల మధ్య సాన్నిహిత్యం ఎక్కువే. చిన్నప్పటి నుండి చదువులో చురుకుగా వుండే అనిల్‌ను నాయుడు గారే ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. తన బిడ్డను పెద్ద చదువులు చదివిస్తోన్న నాయుడిగారి విశాల హృదయం గురించి పలుమార్లు పలువురి దగ్గర రంగారావు ప్రశంసించిన సందర్భాలు కోకొల్లలు.

అనిల్, శోభనల ప్రేమ వ్యవహారం నాయుడు గారికి తెలిసింది. అగ్గిమీద గుగ్గిలంలా మండిపడలేదు.....తాపీగా ఆలోచించాడు. యుక్త వయస్సులో యువతీ యువకుల నడుమ ప్రేమ అంకురించడం సహజాతి సహజంగా భావించారాయన. కానీ, తన కుటుంబ ప్రతిష్ఠకు మచ్చతెచ్చే ఈ కలయికను అడ్డుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఎవరికీ తెలియకుండా..... ముఖ్యంగా తన కూతురు శోభనకు తెలియకుండానే ఈ సమస్యను సున్నితంగా పరిష్కరించాలని నిర్ణయించుకున్నాడు.

ఓ అర్థరాత్రి వేళ నాయుడుగారు రంగారావు ఇంటికి వెళ్ళాడు అర్ధరాత్రివేళ. రంగారావుకు విషయం వివరంగా చెప్పాడు. అక్కడే వున్న అనిల్ ముద్దాయిలా నిల్చుండిపోయాడు.నాయుడుగారు చెప్పడం ప్రారంభించాడు.....

"అనిల్....ప్రేమించడం తప్పుకాదు. కానీ, నువ్వు మాఅమ్మాయిని ప్రేమించడం మాత్రం తప్పు. ఆస్తులు, అంతస్తులు.....కులాలు, మతాలు..... ప్రేమకు అడ్డంకారాదనేది మీ వయసు మాట్లాడేభాష. కానీ మా అంతస్తు భాష వేరేగా ఉంటుంది. అది తెలుసుకుంటే మంచిది" అన్నాడు రంగారావు.

"మన్నించండి నాయుడుగారూ ! మీ పంచన బతుకుతున్నాం. మీరెలా చెబితే అలా . ఇప్పుడేం చెయ్యమంటారో చెప్పండి"

"ఈ ఏడాదితో నీ కొడుకు చదువు పూర్తయిపోతుంది. డిగ్రీ తీసుకొని అనిల్ ఈ ఊరు విడిచి వెళ్ళాలి. ఓ అయిదు సంవత్సరాలు అతను ఎక్కడ వున్నదీ ఎవ్వరికీ తెలియకూడదు.. గంభీరంగా, నిశ్చలంగా తన అభిప్రాయాన్ని చెప్పి..... ఆచరించవలసిందిగా ఆదేశించారు రాజగోపాలరావునాయుడు.

"అనిల్..... మనకు అన్నం పెట్టిన చెయ్యి నాయుడుగారిది. వారి దాతృత్వం నీకు విద్యాదానం చేసింది. ఆయన పట్ల మనం విశ్వాసం చూపించాలేగాని ఆయన గుండెలపై తన్నకూడదు " రంగారావు అనిల్‌కు హితబోద చేయడం మొదలుపెట్టాడు. అతను దోషిలా తలొంచుకొని నిల్చున్నాడు. విశ్వాసం, కృతజ్ఞత అనే పదాలు తప్ప అతనికి వేరే మాటలేవీ వినిపించడంలేదు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే మనసును చంపుకొని కఠినమైన నిర్ణయం తీసుకున్నాడు.

"మీరు చెప్పినట్లు నడుచుకుంటాను.

" వెరీగుడ్! మాట మీద నిలబడతావని నమ్ముతున్నాను".

అనిల్‌కుమార్ భుజం తట్టి రాజగోపాలరావు నాయుడు వెళ్ళిపోయాడు.

◆ ◆ ◆

చెప్పడం ఆపి కళ్ళుమూసుకొని సోఫాలో కూర్చుండిపోయాడు అనిల్‌కుమార్. "ఈ ఐదు సంవత్సరాలలో ఆమె జీవితం ఎన్ని మలుపులు తిరిగిందో ఎప్పుడైనా ఆలోచించావా?" సీరియస్‌గా ప్రశ్నించాడు హరి.

"లేదు....!"

"ప్రేమించావు కదా.....!? కనీసం.... ఎలావుందో..... ఏమైపోయిందో...అని కూడా ఆలోచించలేదా?"

"లేదు....!" అదే సమాధానం.

"ఎందుకని...?"

"ఆమె తండ్రికి మాటిచ్చాను గనుక...!"

"మూర్ఖుడా!" గర్జించాడు హరికిరణ్. బిత్తరపోయాడు అనిల్....!

" ఆర్థిక సంబంధాల కోసం మానసిక అనుబంధాన్ని దూరం చేసుకుంటావా? పట్టుపరుపులపై నడిచిన కోటీశ్వరుడి బిడ్డ నిన్ను ప్రాణంకన్నామిన్నగా ప్రేమిస్తే..... కృతజ్ఞతను, విశ్వాసాన్ని సాకుగా చూపి ఆమె హృదయంలో బడబాగ్ని రగుల్చుతావా? ధైర్యంలేని వాడివి.... తెగించి ఆమెను పెళ్ళి చేసుకునే సాహసం చేయలేనివాడివి.... అసలు ఎందుకు ప్రేమించావ్? పిచ్చిదానిలా, వెర్రి చూపులు చూస్తూ జీవితాంతం నీ కోసం ఎదురుచూసే అభాగ్యురాలిలా బ్రతికే దుర్దశను ఆమెకు ఎందుకు కల్పించావ్?"

ఆవేశంతో ఊగి పోయాడు హరికిరణ్.

"ఏంటీ....శోభన... నాకోసం ఇప్పటికీ ఎదురుచూస్తోందా?" ఆశ్చర్యంగా అడిగాడు అనిల్.

"ఇంకా శోభనకు పెళ్ళికాలేదా? "

"లేదు!" అనిల్‌కుమార్ వాక్ప్రవాహానికి అడ్డుతగిలాడు హరికిరణ్.

"ఆమె ఇంకా నీకోసం ఎదురుచూస్తూనే వుంది. నువ్వు ఎప్పటికైనా తిరిగి వస్తావనే ఆశతో ఎదురుచూస్తూవుంది".

"ఆమె నీకు తెలుసా? అనిల్ ప్రశ్న.....

"బాగా తెలుసు....ఇప్పటికైనా నువ్వు స్వీకరిస్తావా ? ఆమెను ధైర్యంగా పెళ్ళి చేసుకుంటావా?"

"తప్పకుండా.....శోభనను నేను కలవాలి..... ఆమె పాదాలపై నాశిరస్సు వంచి మన్నించమని వేడుకోవాలి..... రా హరీ...ఆమె దగ్గరకు నన్ను తీసుకెళ్ళు!" ఉద్వేగంతో అడిగాడు అనిల్.

"పద....వెళ్దాం!" హరికిరణ్ లేచి నిల్చున్నాడు.

◆ ◆ ◆

కారు కంకిపాడు పొలిమేరలోవున్న రాజగోపాలరావునాయుడుగారి ఫాంహౌస్‌లోని ఓ చిన్న ఇంటి ముందు ఆగింది. ఇద్దరూ కారు దిగారు.

" శోభన ఇక్కడ ఉంటుందా ?" అడిగాడు అనిల్.

"అవును "

ఎన్నో ఏళ్ళ తర్వాత ప్రేయసిని చూడాలన్న ఆశ, ఆత్రుతతో తలుపు తెరిచాడు అనిల్.

వెయ్యివాట్ల కాంతి పుంజాల నడుమ పూమాలతో అలంకరించిన శోభన చిత్రపటం కనిపించింది ఎదురుగా.........వాతావరణం భయంకరంగా మారింది. చుట్టూ చీకట్లు అలుముకున్నాయి. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు అనిల్.

"మనసిచ్చిన నిన్ను మరవలేక.....మనువాడిన నాతో కాపురం చేయలేక మానసిక వికలాంగురాలై మరణశయ్యను ఆహ్వానించింది. ఆ సమాధిలో చచ్చి బ్రతుకుతూ నీకోసం ఇప్పటికీ ఎదురుచూస్తోందిరా నాభార్య శోభన....!" అంటూ విలపించాడు హరి,.

శోభన సమాధి ముందు కుప్ప కూలిపోయాడు అనిల్ . ◆

◆ సినిమా కబుర్లు



'వర్షం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన నటి త్రిష కృష్ణన్. 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'అతడు', 'పౌర్ణమి', 'నమో వెంకటేశ'..తో ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చెన్నై చిన్నది. చిత్ర పరిశ్రమలో అడుగెట్టి పదిహేనేళ్లు దాటినా... తనదైన నటనతో తళుక్కున మెరుస్తూనే వుంది. రజనీకాంత్ 'లింగ' చిత్రంలో ఐటమ్ సాంగ్ చేసి అభిమానులను ఆశ్చర్యపరిచిందనే అనుకోవాలి. తెలుగు, తమిళ చిత్రాలతోపాటు కన్నడ సినిమాలు కూడా చేసేస్తూ బిజీగా వున్న త్రిష చెప్తోన్న ఆసక్తికర విషయాలు...

'అతను' అలా ఉండాలి

సినిమాల గురించి...

ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో ఎవరికీ దేన్నీ నిరూపించుకోనవసరం లేదు. గత పది పన్నెండేళ్లగా చిత్ర పరిశ్రమలో వున్నాను. నేను చేయదల్చుకున్న పాత్రలను ఎంపిక చేసుకోగల పరిణతి వుంది. మొదట ఐదేళ్ల పాటు పరిశ్రమలో నిలదొక్కుకోడానికి, నిరూపించుకోడానికి ప్రయత్నించాల్సి వుంటుంది. అందుకు తగ్గట్టుగానే పని చేయాలి. వచ్చిన అవకాశాలను కాదనలేం. పెద్ద బ్యానర్లు చేస్తుంటాం. అది అప్పటి సంగతి. ఇప్పుడు కేవలం ఎంపిక చేసుకున్నవే చేయగలను. దానివల్ల పోగొట్టుకునేదేం వుండదు. ప్రయోగాలు చేయాలా వద్దా అనేది కూడా నిర్ణయించుకుంటాను. ఆఫ్ బీట్ సినిమాలూ చేస్తాను కావాలంటే. పాత్రలతో ప్రయోగాలూ చేస్తాను. కెరీర్ మొదట్లో ఇలా చేయలేం కదా.

వ్యక్తిగత జీవితం

బావుంది. ఉద్దానపతనాలేం లేవు. కుటుంబం...స్నేహితులతో బంధాలకు సంబంధించి ఎలాంటి మార్పు రాలేదు. నా వారంతా నా చుట్టూ వున్నారు. పరిశ్రమలో చాలా మంచి స్నేహితులున్నారు.

పెళ్లి

పెళ్లి మీద నమ్మకం వుంది. నేను పెళ్లి చేసుకోబోయే వ్యక్తిని ఇంత వరకు కలవ లేదనుకుంటున్నాను. ప్రస్తుతానికి సింగిల్‌గానే వున్నా. అయితే అందుకు కెరీరో ...మరొకటో ...కారణం కాదు.

నా మూలాలను అర్థం చేసుకోగల వ్యక్తిని పెళ్లాడతాను. నా కుటుంబానికి నేను చేసే వృత్తి పట్ల పూర్తి గౌరవం వుంది. అర్థం చేసుకుంటుంది. అతను కూడా అలాంటివాడై వుండాలి. డబ్బు, కుటుంబం, స్నేహితుల విలువ తెలిసి వుండాలి. ఇవేవీ జరగనప్పుడు నేను ఒంటరిగా జీవించడానికే ఇష్టపడతాను. వివాహ వ్యవస్థ మీద నమ్మకం వుంది. పెళ్లిళ్లు ఎందుకు చేసుకుంటారో కూడా అర్థం చేసుకోగలను. ఎవరికైనా సరే 45-50 వస్తున్నాయంటే ఒక తోడు చాలా అవసరం. వీటన్నిటి వెనక ఒక కారణం వుంది. అయితే ఇది జీవిత భాగస్వామి సరైనవారైతేనే!

ఇంత సుదీర్ఘ కాలం చిత్ర పరిశ్రమలో వుండడాన్ని నమ్మలేకపోతున్నాను. అందుకు పరిశ్రమకు ధన్యవాదాలు చెప్పాలి. తోటి నటీనటులు, దర్శకులే కాదు... కొత్తగా అడుగెట్టినవారి నుంచి ... ప్రతి రోజూ నేర్చుకుంటూనే వుంటాను. విభిన్నమైన చిత్రాలలో నటించాలనుకుంటున్నా.

భవిష్యత్

నటనతోపాటు దర్శకత్వం చేస్తానేమో ఎవరికి తెలుసు! చిత్ర నిర్మాణమూ చేయొచ్చు. ఏదైనా తెర వెనుక బాధ్యత చేపట్టవచ్చు. పెళ్లయినప్పటికీ ఖచ్చితంగా ఏదైనా విభిన్నమైన బాధ్యతలు చేపడతా. అయితే భవిష్యత్ గురించి పెద్దగా ఆలోచించలేదు.

ప్రత్యేకంగా అన్పించిన చిత్రాలు

చాలా వున్నాయి. నా కెరీర్‌లో అనేక సినిమాలు చేశాను. తొలి రెండు తెలుగు చిత్రాలు చాలా ప్రత్యేకమైనవి. మొదటి సినిమాతోనే చాలా కాలం గుర్తింపు పొందాను. అది నాకెప్పుడూ ప్రత్యేకమైనదే. 'ఘిల్లి, సామి' కూడా బి, సి సెంటర్లలో మంచి బ్రేక్ ఇచ్చాయి. గౌతమ్ మీనన్‌తో చేసిన తాజా చిత్రం 'విన్నైతండి వరువయ' కూడా నాకు ప్రత్యేకమైనదే. మంచి స్నేహితుడైన మీనన్‌తో పని చేయడమంటే చాలా ఇష్టం. ఆ ప్రయాణం ఓ మంచి జ్ఞాపకం. రాధా మోహన్‌తో చేసిన 'అభియుమ్ నానుమ్' కూడా నేను చేసిన మరో గొప్ప చిత్రం.

బాలీవుడ్

నేను దీని గురించి పెద్దగా ఆలోచించలేదు.

మంచి స్నేహితుడైన ప్రియన్ అడగడంతో 'ఖట్టా మీఠా' సినిమా చేశాను. అక్షయ్‌తో కలిసి పనిచేయడం బాగుంది. ఓ హిందీ సినిమా చేసినట్టనిపించలేదు. స్థానిక చిత్రం చేసినట్టే అనిపించింది. అంతేకానీ...ముంబై వెళ్లిపోయి మరిన్ని అవకాశాల కోసం ప్రయత్నించాలని మాత్రం అనుకోలేదు.

హిందీ సినిమాలన్నా ఇష్టమే. 'మేరీ కోమ్' గొప్ప చిత్రం. ప్రియాంక చోప్రా గుర్తుండిపోయేలా చక్కగా నటించింది.

చేతిలో వున్న సినిమాలు

ఎం.ఎస్ రాజు 'రమ్' గొప్ప యాక్షన్ చిత్రం. చిత్ర కథ చాలా బావుంది. అందులో నేను నటించినందుకు సంతోషిస్తున్నాను. గౌతమ్ మీనన్–అజిత్ కాంబినేషన్‌లో నేను నటించిన చిత్రం విడుదల కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నా. మీనన్ రొమాంటిక్ చిత్రాలను చక్కగా తీస్తాడు. చిత్రాల ఎంపికలో ఎలాంటి ఎత్తుగడలు వుండవు. ధైర్యంగా ఎంచుకోవడమే.

ఇతర ఆసక్తులు

చాలానే వున్నాయి. మోడలింగ్ చేశాను. 'పెటా' కార్యక్రమాల్లో పాల్గొంటాను. నాకు పెంపుడు జంతువులంటే...చాలా ఇష్టం. వాటివల్ల మనలో ఏమైనా ఒత్తిడి వుంటే మాయమైపోతుంది. స్వచ్ఛమైన, నిష్కళంకమైన ప్రేమ వాటిది. ఎంత తీరికలేకపోయినా ఏడాదికి రెండుసార్లు ప్రయాణాలు పెట్టుకుంటాను. అన్నివేళల్లోనూ న్యూయార్క్ చూడదగ్గ ప్రదేశం. ఒంటరిగా కూడా యూరప్ వెళ్లొచ్చు. నాకంటూ

కొంత వ్యక్తిగత సమయం మిగులుతుంది అక్కడికెళితే. స్కూబా డైవింగ్ వంటి వినోదాలకు మాల్దీవ్స్ మంచి ప్రదేశం. లండన్ కూడా బావుంటుంది. ఇండియాలో జైపూర్, జోధ్‌పూర్, అమృత్‌సర్... చెప్పుకోదగ్గవి. మరీ ముఖ్యంగా అమృత్‌సర్ ఎన్నిసార్లైనా చూడాలనిపిస్తుంది.

బయటికెళ్లేప్పుడు వెంటే వుండేవి

ఫోను, డబ్బు, డ్రైవింగ్ లైసెన్స్. కారు సొంతగా నడపడానికే ఇష్టపడతాను. డ్రైవర్‌తో పనే లేదు. సంగీతం వినడమంటే ఇష్టం. తమిళ్ మ్యూజిక్ అంటే చెవి కోసుకుంటాను. హెడ్‌ఫోన్‌లో ఎ.ఆర్.రెహమాన్ సంగీతం వింటూ నడుస్తుంటే అద్భుతంగా వుంటుంది.

షూటింగ్ లేకపోతే...

షూటింగ్ వుంటే వెళ్లడం...రావడం...నిద్ర...ఇదే సరిపోతుంది. ఒకవేళ ఎటువంటి షూటింగులు లేకపోతే మాత్రం బద్ధకం ఆవరిస్తుంది. టీవీ కార్యక్రమాలు చూసేస్తుంటా. బాగా ఆలస్యంగా నిద్ర పోవడం... ఆలస్యంగా లేవడం... కుటుంబంతో గడపడం. నేస్తాలతో కాఫీ, భోజనం... పెంపుడు కుక్కలతో కాలక్షేపం... అలా నడిచిపోతుంది.

ఇష్టమైన ఆహారం

బతకడానికి తినాలన్నది నా సిద్ధాంతం. 'ఓ మై గాడ్! ఇంత తిని కూడా నువ్వు అలా ఎలా వుండగలుగుతున్నావు?' అని అడుగుతుంటారు స్నేహితులు. అందుకు నేను చాలా అదృష్టవంతురాలిని. నాకు లెబనీస్, కొరియన్ వంటకాలంటే ఇష్టం. దేశీయ వంటకాలన్నా ఇష్టమే. అయితే నేను వంట జోలికి అంతగా వెళ్లను.

నమ్మేది

జీవితంలో మార్పులు వస్తుంటాయి. ఎత్తు పల్లాలు సహజం. అన్నివేళలా ఒకేలా వుండగలగాలి. ◆

ట్విటర్ స్టార్లు

బాలీవుడ్ తారలకూ ట్విటర్ అకౌంట్లున్నాయి. సినిమాలు, షూటింగులతో ఎంత బిజీగా వున్నా... రోజుకు కనీసం నాలుగైదు ట్వీట్లు చేయందే తోచదు వీరికి. అయితే వీరిలో ఎవరు ఎక్కువ చురుగ్గా ట్వీట్ చేస్తుంటారు? అనేదానిమీద ఓ ఆంగ్ల పత్రిక ఇచ్చిన ర్యాంకులివి. చూసేద్దామా!

చురుకైన తారలు
(రోజుకు చేసే ట్వీట్లు అంకెల్లో)

అమితాబ్ బచన్	20
అభిషేక్ బచన్	10
షారూక్ ఖాన్	5
అనుపమ్ ఖేర్	7.69
సోనాక్షి సిన్హా	4

సూపర్ ఫాలోవర్లు
(స్టార్ల ఫాలోవర్లు లక్షల్లో)

ఆమీర్ ఖాన్ 45.79
అమితాబ్ బచన్ 45.11
షారూక్ ఖాన్ 43.88
సల్మాన్ ఖాన్ 37.69
దీపికా పదుకొనే 34.94

1

11.9 మిలియన్ ఫాలోవర్లు
20 రోజుకు చేసే ట్వీట్లు
అమితాబ్ బచ్చన్

2

10.3 మిలియన్ ఫాలోవర్లు
5 రోజుకు చేసే ట్వీట్లు
షారుక్ ఖాన్

3

3.58 మిలియన్ ఫాలోవర్లు
10 రోజుకు చేసే ట్వీట్లు
అభిషేక్ బచన్

4

7.99 మిలియన్ ఫాలోవర్లు
2.78 రోజుకు చేసే ట్వీట్లు
ప్రియాంక చోప్రా

5

7.66 మిలియన్ ఫాలోవర్లు
2.38 రోజుకు చేసే ట్వీట్లు
హృతిక్ రోషన్

6

8.45 మిలియన్ ఫాలోవర్లు
1.59 రోజుకు చేసే ట్వీట్లు
దీపికా పదుకొనే

7

5.4 మిలియన్ ఫాలోవర్లు
2.63 రోజుకు చేసే ట్వీట్లు
సోనమ్ కపూర్

8

9.98 మిలియన్ ఫాలోవర్లు
.40 రోజుకు చేసే ట్వీట్లు
ఆమీర్ ఖాన్

9

9.52 మిలియన్ ఫాలోవర్లు
.69 రోజుకు చేసే ట్వీట్లు
సల్మాన్ ఖాన్

10

3.6 మిలియన్ ఫాలోవర్లు
4 రోజుకు చేసే ట్వీట్లు
సోనాక్షి సిన్హా

◆ నివాళి

మర్చిపోలేని సుస్వరం

(డిసెంబర్ 24 రఫీ జయంతి)

"ఏ మేరా ప్రేమ్ పత్ర్ పఢ్ కర్ కె తుమ్..." అని ఆయన సుమధురంగా ఆలపిస్తే ప్రేమను ద్వేషించేవారు కూడా ప్రేమ లేఖలకు తలవొంచారు. 'హసీనా.. ఓ హసీనా, నామది నిన్ను పిలిచింది గానమై, నేడే తెలిసింది ఈనాడే తెలిసింది...' పాటలు వినని, తెలియని తెలుగు వారుండరేమో! ఆయనే గాన గంధర్వుడు మహమ్మద్ రఫీ.

హిందీ సినీ జగతుత్తలో 1950–1970ల మధ్య కాలం మహ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి కాదు. ఈ దశలో రఫీ లేని పాటల ప్రపంచాన్ని అస్సలు ఊహించలేం. రఫీ గానం హిందీ చలన చిత్ర నేపథ్య గాన చరిత్రలో ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. కేవలం రఫీ పాటలు ఉంటే చాలు... నటినటులెవరైనా... ఆ సినిమాలు ఘన విజయం సాధిస్తుందని నమ్మకం. శమ్మీ కపూర్, గురు దత్, రాజేంద్ర కుమార్ మెదలగు నటులు వెలుగొందడానికి రఫీ గళం ఎంతగానో తోడ్పడింది. ఆయన గాత్రంలో ఎంతటి మహత్తు ఉన్నదంటే అప్పట్లో ఉరిశిక్షపడ్డ ఓ ఖైదీ తన చివరి కోరికగా రఫీ పాడిన "ఓ దునియా కే రఖ్ వాలే' అనే పాట వినిపించమని కోరాడట. ఎంతోమంది నటుల పాటలకు తన గళాన్నందించి అవి వారివారి స్వరాలే అన్నంతగా భ్రమలు కల్గించి ఆయా నటుల నటనకు అదనపు సొబగులద్దినవాడు రఫీ. యువళ గీతాలతో ఆశా భోంస్లే ఒక్కరే ఆయనతో సరితూగ గలరమో అనిపిస్తుంది. ఆయన స్వరంలోని పంజాబీ జీర అద్భుతంగా వుండి మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తుంది.

కోట్లాది మంది సంగీత ప్రియులను తన సుస్వరంతో పరవశింప జేసిన మహమ్మద్ రఫీ 1924 సంవత్సరం డిసెంబరు 24 న పంజాబ్‌లోని కోట్ల సుల్తాన్ పూర్‌లో జన్మించారు. బాల్యం నుండి సంగీతం పట్ల మక్కువతో అబ్దుల్ వహీద్ ఖాన్ బడే గులాంఖాన్ లాంటి విద్వాంసుల వద్ద హిందుస్థానీ, శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు. పదమూడేళ్ల ప్రాయంలోనే ప్రముఖ గాయకుడు సైగల్ సంగీత కార్యక్రమం చూసేందుకు వెళ్ళగా కార్యక్రమం ప్రారంభంలోనే విద్యుత్ అంతరాయమేర్పడింది. కరెంటు వచ్చిన తరువాతే పాడతానని లేకపోతే పాడేది లేదని

సైగల్ అనగా రఫీ సోదరుడు నిర్వాహకులను కలిసి కరెంటు వచ్చేలోగా తన తమ్ముడికి పాడేందుకు అవకాశం ఇవ్వమని అర్థించగా అప్పటికే ప్రేక్షకులు గొడవ చేస్తుండటంతో రఫీకి పాటలు పాడే అవకాశమిచ్చారు. అంతే హలు మెత్తం బాల రఫీ స్వరమాధుర్యానికి ముగ్ధులై జేజేలు పలికారు. అక్కడే వున్న శ్యాంసుందర్ అనే సంగీత దర్శకుడు రఫీలోని అద్భుత గాయకుడ్ని గుర్తించి బొంబాయికి ఆహ్వానించి "గుల్ బలోచ్" అనే పంజాబీ సినిమాలో మెదటిసారిగా పాడించారు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా మెల్లమెల్లగా ఒక్కో మెట్టును అధిరోహిస్తూ తన గానంతో మూడున్నర దశాబ్దాలకు పైగా ప్రేక్షకులను శ్రోతలను సంగీత సాగరంలో ఓలలాడించాడు. మహమ్మద్ రఫీ "చాహే కోయీ ముఝే జంగ్లీ కహే..." అనే పాటతో కుర్రకారును వెర్రెత్తించారు. 'బహరో ఫూల్ బర్సావో (సూరజ్), తేరీ ప్యారీ సూరత్ కో (ససురాల్), గోరియా కాహా తేరే దేశ్ రా...(కారవాన్), ఏ రంగ్ న ఛుటేగా (చైనా టౌన్), చౌధవీ కా చాంద్ హో (చౌధవీ కా చాంద్), మై గావూ తుమ్ సో జావో (బ్రహ్మచారి), మేరే దోస్త్ కిస్సా యే క్యా హోగయా... (దోస్తానా)' లాంటి ఆణిముత్యాల లాంటి పాటల్ని వేలల్లో పాడారు. ఇక సుభాష్ ఘై చిత్రం 'కర్జ్'లో రిషీ కపూర్ పాత్రకు రఫీ పాడిన "దర్ద్ ఎ దిల్ దర్ద్ ఎ జిగర్" అన్న పాట దేశమంతటా మారు మోగింది. ముబారక్ బేగంతో పాడిన యుగళ గీతం "ఓ లేకే పెహ్లా పెహ్లా ప్యార్..." విశేష ప్రజాభిమానాన్ని చూరగొన్నది. గురుదత్ సినిమాలైన 'ప్యాసా, కాగజే కే ఫూల్' సినిమాల ఆకర్షణ అంతా రఫీ గానలహరే. నౌషాద్, ఆర్.డి. బర్మన్, శంకర్ జైకిషన్, లక్ష్మీకాంత్–ప్యారేలాల్, ఒ.పి.నయ్యర్ సంగీత సారథ్యంలో మజ్రూ సుల్తాన్ పురి, ఆనంద్ బక్షి, హస్రత్ జైపురి, షకీల్ బదయుని, శైలేంద్ర లాంటి గీత రచయితల పాటలను శ్రవణానందంగా గానం చేయటం ద్వారా వారికి కూడా ఎంతో పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టాడు. పద్మశ్రీ అవార్డుతో పాటు ఎన్నో అవార్డులను రివార్డులను స్వంతం చేసుకున్నాడు రఫీ. హిందూ భక్తి గీతాలు, భజనల్ని సైతం పాడి శ్రోతల్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తాడు. 'భలే తమ్ముడ, తల్లా పెళ్ళామా! అక్బర్ సలీమ్, అనార్కలి, ఆరాధన...' లాంటి తెలుగు సినిమాలతో పాటు 17 భాషలలో సుమారు 10 వేలకు పైగా పాటలు పాడాడు రఫీ. శాస్త్రీయ గీతాలు, భక్తి గీతాలు, దేశభక్తి గీతాలు, గజళ్ళు, విరహ గీతాలు, ప్రణయ గీతాలు, మెలోడీ, స్పీడు పాటలు... ఒకటేమిటి వైవిధ్య భరితమైన పాటలెన్నో ఆయన గళం నుండి జాలువారినవే. గాంధీ హత్యానంతరం రాజేంద్ర కిషన్ రాసిన దేశ భక్తిగీతం "సునో సునో రె దునియా వాలో, బాపూజీకీ అమర్ కహనీ...' అన్న పాట సంచలనం సృష్టించింది.

1980 సంవత్సరంలో రఫీ మరణించాడు. కానీ ఆయన స్థానాన్ని మరెవ్వరూ భర్తీ చేయలేకపోయారు. రఫీని స్మరించుకోవడమంటే భారతీయ సంగీతాన్ని స్మరించుకోవడమే. 2013వ సంవత్సరం సిఎన్ఎన్–ఐబిఎన్ పోల్‌లో 'గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమా'గా రఫీని ఎన్నుకున్నారంటే మరణించిన 33 సంవత్సరాల తరువాత కూడా ఆయన పట్ల అభిమానం చెక్కుచెదరలేదనడానికి చిహ్నం. అభిమానులెప్పటికీ మరచిపోలేని సుస్వరం "మహమ్మద్ రఫీ".

- కడియాల సాంబశివరావు,
9491373864

నవ్వుల్ – పువ్వుల్

పెద్ద

కవి : మీకు తెలుసా.. నేనో పెద్ద కవిని...!

సుబ్బు : మీ దగ్గరకు ఎవరూ రాకుండా, అందరూ దూరంగా పారిపోతున్నపుడే అనుకున్నా, మీదేదో ఇలాంటి జాబేనని...!



ఫ్యాన్

అభిమాని : మీకు నేను పెద్ద ఫ్యాన్‌నండీ. మీ సినిమా ప్రతీదీ నేను చూస్తా.. మీరేం చెప్పినా చేస్తా..!

హీరో : ఆహా..అలాగా అయితే పది లక్షలుంటే అప్పివ్వు..!

పదును

రాజు : మహామంత్రీ...వేటకు వెళదామనుకుంటున్నాను. కత్తిని సిద్ధం చేయండి.

మంత్రి : ఆ కత్తితో బెండకాయలు తెగడం లేదని, పదును పెట్టడానికి ఇచ్చారటండీ రాణిగారు...!



ప్రూఫ్



బాస్ :ఆఫీసుకి ఇంత లేటుగా వచ్చావేం?

ఉద్యోగి : దారిలో ఒకావిడకు యాక్సిడెంట్ అయింది. ఆవిడను సేవ్ చేసి వచ్చా!

బాస్ : అందుకు నాకు ప్రూఫ్ ఏమిటి?

ఉద్యోగి : ఇంటికెళ్ళి మీ ఆవిడనడగండి యాక్సిడెంట్ అయింది మీ ఆవిడకే సార్!

బలం

రోగి : నాకు సంపూర్తిగా బలం రాడానికి ఎంత పరిమాణంలో ఈ టానిక్ తీసుకోవాలి డాక్టర్ గారూ!

డాక్టర్: ఆ.. ఎంత.. ఓ లారీ ట్యాంకర్ తీసుకుంటే సరిపోద్ది.

కళ

మాణిక్యం : 'ఇచ్చట కళలు నేర్పబడును' అని బోర్డు పెట్టారు కదా ఎక్కువగా ఏ కళ నేర్పుతారు?

మల్లేష్ : చోర కళ.

మాణిక్యం : అంటే దొంగతనాలు చేయడం నేర్పుతారా?

మల్లేష్ : మరి 64 కళల్లో చోర కళ కూడా ఒకటి కదా, అందుకు!



స్కిల్

రాజ్ : ఇంటర్వ్యూలో ఎందుకు సెలక్ట్ కాలేకపోయావురా?

రావ్ : నా వద్ద ఏ విధమయిన స్కిల్ లేదన్నారురా!

రాజ్ : లాగి చెంపమీద ఒకటివ్వవలసింది. ఈ స్కిల్ వుందని వారికి తెలియడానికి!

కారు

జిల్ : బి.టెక్ పాసయితే కారు కొనిస్తానన్నాడురా మా నాన్న!

జిగా : మరి ఎందుకు పాస్ కాలేకపోయావు?

జిల్ : రోజంతా చదవడం మాని, ఇంటర్నెట్‌లో రకరకాల కార్లు చూడటానికే టైమంతా వేస్ట్ చేశానురా!

దానం

భిక్షగాడు : అర్ధ రూపాయి ధర్మం చేయండి బాబయ్యా!

పిసినారి : ఏం.. అర్ధ రూపాయే ఎందుకు అడుగుతున్నావ్?

భిక్షగాడు : మీరు అంతకన్నా ఎక్కువ వేసే ముఖంగా కనబడడం లేదు.

పోలీస్

బేరర్ : టిఫిన్ తిన్నావుగా, బిల్లు కట్టు!

వ్యక్తి : డబ్బుల్లేవు.

బేరర్ : ఏం పోలీసులకు ఫోన్ చేయనా?

వ్యక్తి : ఆ చెప్పు..

బేరర్ : ఇంతకీ ఎవరు నీవు?

వ్యక్తి : పోలీస్‌ని!

- ముత్యాల శ్రీశరత్‌బాబు, ఫోన్ నెం : 9963298921

దొంగ... దొంగ...

ఈజిప్టులోని ఓ న్యాయస్థానం... గత నెల 11వ తేదీన... ముగ్గురు జర్మన్లకు, ఆరుగురు ఈజిప్షియన్లకు... ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఎందుకేంటి?! గ్రేట్ పిరమిడ్ నుంచి అత్యంత పురాతన సంపదను, రాళ్లను చోరీ చేసినందుకు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఏడు ప్రఖ్యాత చోరీల గురించి ... చూద్దాం.

నటరాజు

ఆస్ట్రేలియా నేషనల్ ఆర్ట్ గ్యాలరీ ఓ కంచు నటరాజ విగ్రహాన్ని సుభాష్ కపూర్ అనే కళా వ్యాపారి దగ్గర కొనుగోలు చేసింది. ఇప్పుడు కాదులేండి! 2008లో. ఎంతకనుకుంటున్నారు? 5.6 మిలియన్ డాలర్లకు. నాలుగేళ్ల తర్వాత అసలు విషయం బయట పడింది. భారతీయ ఆలయాల నుంచి నటరాజ విగ్రహాన్నే కాక, పలు కళాకృతులను కపూర్ సార్వాడు దొంగిలించాడని. అందుకు గాను ఆయనగారిని అరెస్టు కూడా చేశారనుకోండి. ఈ విగ్రహం ధర ఇంత వుంటుందా? అన్న అనుమానం రాకుండా వుంటుందా?! పదకొండవ శతాబ్దానికి చెందినది కనుకే దానికి అంత ధర. 2006లో తమిళనాడులోని ఆరియలూర్ జిల్లాలోని ఓ ఆలయం నుంచి అది చోరీ అయ్యిందట. అయితే ఆ మధ్య ఆస్రేలియా ప్రధాని మన దేశం వచ్చినప్పుడు ... నటరాజుతోపాటుగా తమిళనాడులో చోరీ అయిన ఇతర విగ్రహాలను కలిపి మన ప్రధాని మోడీగారికి అప్పగించి వెళ్లారు.

బెన్‌ఘాజి సంపద

2011వ సంవత్సరం. మార్చి నెల. మయన్మార్‌లో గడాఫీ పాలనకు తెర పడుతున్న కాలమది. బెన్‌ఘాజిలోని నేషనల్ కమర్షియల్ బ్యాంక్‌కు చెందిన నేలమాళిగల్లో భారీ దొంగతనం జరిగింది. అక్కడి పురాతన వస్తువులతో పాటుగా, 7,700 బంగారు, వెండి, కాంశ్య నాణేలు చోరీ అయ్యాయి. షాహత్ నగరంగా పిలవబడుతున్న పురాతన రోమన్ నగరంలోని ఆర్టెమిస్ ఆలయంలో అధికశాతం సంపద బయటపడింది. ఇదంతా అలెగ్జాండర్ కాలం నాటిది. వీటి వెల ఎంత వుంటుందో కూడా చెప్పలేం. అంత అమూల్యమైనవవి. వాటిని రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో రోమ్‌లోని ఓ మ్యూజియంలో ప్రదర్శించారు. 1960లో అవి తిరిగి లిబియా చేరుకున్నాయి.

నాజీ లూటీ

1930–1940 మధ్య కాలంలో నాజీలు యూరప్‌ను దోచుకున్నారు. ఆ క్రమంలో 16,000 కళాఖండాలు, బంగారం పెద్ద మొత్తంలో వారి చెంతకు చేరింది. 2013 నవంబర్‌లో జర్మన్ పరిశోధకులు కొందరు 1500 చిత్రాలను మునిచ్ అపార్ట్‌మెంట్‌లో కనిపెట్టారు. వాటి విలువ ఒక బిలియన్ డాలర్లు వుంటుందని అంచనా. వీటిలో హెన్రీ మటిస్సే, పాబ్లో పికాసో చిత్రాలు కూడా వున్నాయి. నాజీ కళా వ్యాపారి కుమారుడి ఇల్లు అది. వీటిలో అత్యధికం గతంలో నాజీలు సొంతం చేసుక్ను కళాఖండాలే. అయితే వీటిని పరిశోధకులు తిరిగి చేజిక్కించుకునే నాటికే శిధిలావస్థలో వున్నాయట.

మొనాలిసా

లియోనార్డో డావిన్సీ కుంచె నుంచి జాలువారి ... ప్రపంచ ప్రసిద్ధి పొందిన చిత్రరాజం 'మొనాలిసా'. 1911, ఆగస్టు 21వ తేదీన పారిస్‌లోని లోవ్రే మ్యూజియం నుంచి దొంగిలించబడింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే అనుమానితుల్లో కవి–నాటక రచయిత గిలౌమి అపోలినైర్, చిత్రకారుడు పికాసో పేర్లు కూడా చెప్తుంటారు. కాకపోతే రెండేళ్ల తర్వాత ఫ్లోరెన్స్‌లో ఈ కళాఖండం బయటపడింది. విన్‌సెంజో పెరుగియా అనే పెద్ద మనిషి దానిని ఓ గ్యాలరీవారికి విక్రయించే ప్రయత్నం చేసినప్పుడు విషయం బైటపడింది. మరో వార్తేమిటంటే... ఈ పెరుగియా గారు ఎక్కడైతే మొనాలిసా మిస్సయిందో అక్కడ పనిచేశాడు. ఓ రోజు మొనాలిసాను తెల్లటి గుడ్డలో చుట్టుకుని చెక్కేశాడు. కాకపోతే దాన్ని అమ్మచూపినప్పుడు ఆయనగారి చోర కళ బైటపడింది.

బోస్టన్ కళాఖండాలు

500 మిలియన్ డాలర్ల విలువ చేసే కళాఖండాలు చోరీ అయ్యాయి. ఎక్కడ ఎప్పుడు అంటారేమో! బోస్టన్‌లోని ఇసబెల్లా స్టువార్డ్ గార్డెనర్ మ్యూజియంలో. 1990 మార్చి 18న. అక్కడ నుంచి 13 చిత్రాలు పోయాయి. పోలీసుల వేషాల్లో వున్న ఇద్దరు... నైట్ వాచ్‌మెన్‌ను కట్టిపడేసి ఈ చౌర్యానికి పాల్పడ్డారు. వెళ్తూ వెళ్తూ వీటిని చంకలో పెట్టుకెళ్లారు. వీటిలో రెంబ్రెంట్, మేనెట్, వర్మీర్ గీసిన చిత్రాలున్నాయి. దొంగలను పట్టిచ్చినా, పోయిన కళాఖండాలను అందించినా... 5 మిలియన్ డాలర్ల రివార్డు వుంది. ఆ మధ్య దొంగలు దొరికారని, పోయిన విలువైన కళాఖండాలను గుర్తించామని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) వారు చెప్పినప్పటికీ... వాటిని ఇంతవరకు బైట ప్రపంచం ముందుంచలేదు!

అరుదైన సంపద

800 కళాకృతులు. ఏనాటివో. ఒక ఇంట్లో దొరికితే...! అవి తప్పకుండా చోరీ అయినవే అయివుండాలి. నిజానికి అవన్నీ వివిధ యూనివర్సిటీలు, మ్యూజియమ్‌లు, గ్యాలరీల నుంచి దొంగిలించినవే. వాటి విలువ మిలియన్ డాలర్లు వుంటుందని అంచనా. వీటిని కెనడా, నోవా స్కాటియా ప్రావిన్‌లో వున్న జాన్ టిల్‌మేన్ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. వీటిలో చార్లెస్ డార్విన్ 'ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్' తొలి ప్రతితో పాటుగా 1758లో బ్రిటిష్ సైన్యాధిపతి జనరల్ జేమ్స్ ఓల్ఫ్ రాసిన లేఖ దొరికాయి. లేఖ ఒక్కటే 18 వేల డాలర్ల విలువ చేస్తుంది.



బంగారు నాణేల బిందెలు

లంకెబిందెల గురించి విని వుంటారు. ఈ పద్ధతిలోనే కూజాల్లో బంగారు నాణేలు దొరికాయి నార్మాండీలో. ఓ మహిళ తన ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవడం కోసం ముగ్గురు ఫ్రెంచి వాళ్లను కిరాయికి పెట్టుకుంది. వారు తోటలో తవ్వుతుండగా... 16 బంగారు కడ్డీలు (ఒక్కోటి కేజీ బరువుంటుంది)... 600 బంగారు నాణేలు (1920 నాటివి)...దొరికాయి. యజమానికి వీటి గురించి చెప్పకుండా... 1.2 మిలియన్ డాలర్లకు అమ్ముకోవాలని చూశారా పనివాళ్లు. తన ఇంట్లో బయల్పడిన సంపద గురించి, చోరీ గురించి యజమానురాలికి అప్పుడుగాని తెలియలేదు.

◆ అట్టమీది కథ

వివిధ దేశాల్లో మెర్రీ క్రిస్మస్

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పెద్ద పండుగ క్రిస్మస్. డిసెంబర్ నెల ప్రవేశించిందంటే చాలు! క్రిస్మస్ వేడుకల కోలాహలం మొదలౌతుంది. దాదాపు అన్ని దేశాలలో క్రిస్మస్ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. క్రైస్తవులు అల్ప సంఖ్యాకులుగా నివసిస్తున్న దేశాలలో కూడా మత వైషమ్యాలు లేకుండా జరుపుకుంటారు. చైనా (హాంకాంగ్, మాకావో మినహా), జపాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, థాయ్‌లాండ్, నేపాల్, ఇరాన్, టర్కీ, నార్త్ కొరియా దేశాల ప్రజలు కూడా క్రిస్మస్ పండుగను శోభాయమానంగా జరుపుకుంటారు. ఆ వేడుకల విశేషాలు ఇవాళ్టి అట్టమీది కథలో.

క్రిస్మస్ పండుగ జరుపుకునే డిసెంబర్ 25 నాటికి 7 రోజులు ముందుగానే ఇంటి ముంగిట్లో పచ్చటి క్రిస్మస్ చెట్లు, రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తుంటారు. మానవ జీవితాలలో నిరంతరం సుఖశాంతుల పచ్చదనాలు పరచుకోవాలనే అభిలాషకి సంకేతమే ఈ క్రిస్మస్ చెట్లు అని, అందరి హృదయాలలో ఆనందాల హరివిల్లు వెల్లివిరియాలనే ఆకాంక్షలకి ప్రతిరూపాలే ఆ చెట్లకు అలంకరించిన రంగురంగుల దీపాలు అని విశ్వసిస్తారు. మనదేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ ఈ పండుగను జరుపుకుంటారు. వారివారి సాంప్రదాయాలను బట్టి వేర్వేరు విధివిధానాలతో ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇంటింటా వెలుగులు విరజిమ్మే తారల మధ్య చిన్నారులందరికి క్రిస్మస్ తాతయ్య శాంతాక్లాజ్ కానుకలు అందిస్తుండగా 'హ్యాపీ క్రిస్మస్... మెర్రీ క్రిస్మస్' అంటూ కేకులు కట్ చేసి అందరి నోరు తీపి చేసుకుంటారు. క్రిస్మస్ తాత ఈసారి ఏం కానుకలు ఇస్తాడోనని పిల్లలు వారి వెనుక పెద్దలు ఉత్సాహంగా పరుగులు తీస్తారు. మరో పక్క పలు స్వచ్ఛంద సంస్థలు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలలోనూ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహిస్తారు. దుస్తుల పంపిణీ, అన్నదానం తదితర కార్యక్రమాలు చేపడతారు. దేశంలో వందల ఏళ్ల చరిత్ర ఉన్న గోవాలోని కెథడ్రల్ చర్చి, బాసిలికా ఆఫ్ బామ్ చర్చి, కేరళలోని మన్నార్‌లో ఉన్న పారుమల చర్చి, మలయటూర్ చర్చి, కొచ్చిన్‌లోని శాంతాక్లాజ్ చర్చి, వల్లార్ పాదం జార్జ్ ఫోర్టియాలోని సెయింట్ మేరీస్ చర్చి వంటి చారిత్రక ప్రార్థనాలయాల్లో ... ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్రీస్తు జననం మొదలు ఆయన జీవితంలోని విశేషాలను నాటక రూపంలో ప్రదర్శిస్తారు. రాష్ట్రంలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చిలో బుధవారం తెల్లవారుజామునే క్రిస్మస్ సంబరాలు ప్రారంభమవుతాయి. విజయవాడలోని గుణదల మేరి మాతా ఆలయంలోనూ క్రీస్తు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

లండన్‌లో...

ప్రస్తుతం ప్రపంచం అంతా క్రిస్మస్ సంబరాల్లో మునిగి తేలుతోంది.. యునైటెడ్ కింగ్‌డమ్ దీనికి మినహాయింపు కాదు.. క్రిస్మస్‌కి ఓ నెల ముందే ప్రారంభమయ్యే ఈ వేడుకలు జనవరి 1 వరకు ఉంటాయి. ఈ సమయంలో లండన్‌ను చూడటానికి రెండు కళ్లూ చాలవు. ఇళ్లు, షాపులు, వీధులు, ఆఫీసులు ... అన్నీ

విద్యుద్దీపాల కాంతులతో మిరుమిట్లు కొలుపుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆవిష్కరిస్తాయి. ఈ శీతాకాలంలో సాయంత్రం నాలుగు గంటలకే ఇక్కడ సూర్యాస్తమయం అవుతుంది. కాబట్టి సాయంత్రం నుంచీ మొదలయ్యే పండుగ కోలాహలం అర్ధరాత్రి వరకూ కొనసాగుతుంది. క్రిస్మస్ విద్యుద్దీపాలంకరణ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇక్కడ షాపులను, వీధులను భారీగా లైట్లతో అలంకరిస్తారు. ప్రతి సంవత్సరం ఈ అలంకరణ మారిపోతూ వుంటుంది. అందుకే ఏ ఏడాదికాయేడాది కొత్తగా అనిపిస్తుంది. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్, రెజెంట్ స్ట్రీట్, ట్రాఫాల్గార్ స్క్వేర్‌లో విద్యుద్దీపాలంకరణ చూడముచ్చటగా ఉంటుంది. ప్రతి చోటా క్రిస్మస్ చెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఒకటి నుంచి 50 అడుగుల వరకు ఎత్తుండే ఈ క్రిస్మస్ చెట్లను రంగురంగుల దీపాలతో శోభాయమానంగా అలంకరిస్తారు.

జర్మనీలో క్రిస్మస్ మార్కెట్

అనేక పాశ్చాత్య దేశాల్లోలాగానే.. జర్మనీలో కూడా క్రిస్మస్ పెద్ద పండుగ. డిసెంబర్ నెల రావడంతోటే.. ఎక్కడ చూసినా క్రిస్మస్ కళ కనిపిస్తూ ఉంటుంది. బాగా అలంకరించిన క్రిస్మస్ చెట్లు, క్రిస్మస్ తాత బొమ్మలు, ఈ సమయంలోనే ప్రత్యేకంగా వచ్చే ఎన్నో రకాల చాక్లెట్లు, బిస్కెట్లు.. ఇంకా ఎన్నెన్నో... విశేషాలతో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపిస్తుంది. ప్రత్యేకంగా డిసెంబర్ మొదటి, రెండో వారాల నుంచి "క్రిస్మస్ మార్కెట్లు"

మొదలవుతాయి. ఏ ఊరికి తగ్గట్టుగా ఆ ఊరిలో ఏర్పాట్లు ఉంటాయి. పెద్ద సిటీల్లో పెద్ద స్థాయిలో మార్కెట్లు ఉంటాయి. ఈ క్రిస్మస్ మార్కెట్లో.. చిన్న చిన్న స్టాల్స్ ఉంటాయి. కొన్నిటిలో బొమ్మలు, ఊలు దుస్తులు, చాక్లెట్ పూత పూసిన పండ్లు, ఇంకా మామూలు శాండ్ విచ్ లాంటి తిండి పదార్థాలు ఉంటాయి. ఇక్కడ అన్నిటికంటే చాలా ప్రత్యేకమైనది Glühwein (గ్లూ వైన్). దీనికి కారణం జర్మనీలో క్రిస్మస్ నాటికి బాగా మంచు పడడమే. వాతావరణం బాగా చలిగా ఉంటుంది. ఈ సమయంలో బయట క్రిస్మస్ మార్కెట్ కెళ్ళి వేడి వేడిగా గ్లూవైన్ తాగి పండగ చేసుకుంటారన్న మాట. ఈ పండగప్పుడు మాత్రమే ఈ వైన్ తాగుతారు. దీన్ని అప్పటికప్పుడు తయారు చేసి కప్పుల్లో పోసి ఇస్తూ ఉంటారు.

అమెరికాలో...

ఇక్కడ శీతాకాలం సాయంత్రాలు చాలా త్వరగా చీకటి పడిపోతుంది. ఈ చీకట్లను పోగొట్టి ప్రజల జీవితాల్లో ఉత్సాహం నింపడానికి క్రిస్మస్‌కి నెలరోజుల ముందునుండే వీధులను, ఇళ్ళను లైట్లతో అలంకరించడం ప్రారంభిస్తారు. 'థ్యాంక్స్ గివింగ్' పండగ నవంబర్ నాలుగో గురువారం జరుపుకుంటారు. ఈ పండగ నాటికి దేశంలో ఏ మూలనున్నా కుటుంబంతో కలిసి టర్కీ డిన్నర్ చేసి సమయం గడపడానికి ఇళ్ళకు చేరుకుంటారు. మర్నాడు బ్లాక్ ఫ్రైడే రోజు క్రిస్మస్ కోసం షాపింగ్ చేస్తారు. అప్పుడు దేశం మొత్తంలో, మాల్స్, షాపింగ్ సెంటర్స్ అన్నీ గురువారం రాత్రి నుండి శుక్రవారం రాత్రి వరకు కొన్ని చోట్ల, లేదా కొన్ని గంటలు సేల్స్ అని పెడతారు. ఆ సేల్స్, డిస్కౌంట్స్ కోసం విపరీతంగా షాపింగ్ చేస్తారు అమెరికన్లు. థ్యాంక్స్ గివింగ్ తర్వాతే, వీధుల్లో క్రిస్మస్ లైట్లు, డెకరేషన్స్ చేస్తారు. సిటీల్లో, మాల్స్‌లో పెద్ద పెద్ద క్రిస్మస్ చెట్లు పెట్టి అలంకరిస్తారు. న్యూయార్క్‌లో రాక్‌ఫెల్లర్ ప్లాజా (Rockefeller Plaza), వాషింగ్టన్‌లో వైట్‌హౌస్ ఎదురుగా, ఫిలడెల్ఫియా లవ్‌పార్క్‌లో క్రిస్మస్ చెట్టు పెట్టి విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తారు. ఇలాగే మిగతా పెద్ద సిటీల్లో కూడా చేస్తారు. ప్రతి ఏడు కొత్త రకం లైట్లు, క్రిస్మస్ అలంకరణకు ఇతర వస్తువులు మార్కెట్లోకి వస్తాయి. వీటితో ఇళ్ళని అలంకరిస్తారు. చెట్టుపైన పెట్టే నక్షత్రం ఇంటి పెద్ద లేదా పిల్లల్లో ఒకరితో పెట్టిస్తారు. ఇతర దేశాల కంటే అమెరికాలో క్రిస్మస్ వ్యాపారమయం అయిపోయిందనేది పరిశీలకుల అభిప్రాయం. క్రిస్మస్ పండగ అంటే జీసస్ పుట్టిన రోజు సంబరాల కంటే ఒకరికొకరు గిఫ్ట్లు ఇచ్చుకునే పండగలా తయారయ్యిందని కూడా అంటుంటారు.

క్రిస్మస్ అనగానే అందరికీ గుర్తొచ్చేది క్రిస్మస్ చెట్టు, కేకు, గ్రీటింగు, శాంతాక్లాజ్ తాత, సంగీతం... మరి వాటి గురించి ... కూడా తెల్సుకోవాలిగా.

క్రిస్మస్ చెట్టు

"క్రిస్మస్ చెట్టుగా పచ్చని "కోనిఫెరస్"ను ఉపయోగించటం ఆనవాయితీగా వస్తోంది. 16వ శతాబ్దంలో జర్మనీలోనూ, 15వ శతాబ్దంలో లివోనియా (ప్రస్తుతం ఈస్టోనియా, లాత్వియా)లో మొదట క్రిస్మస్ చెట్టును అలంకరించే సాంప్రదాయం మొదలైందంటారు. క్రిస్మస్ రోజుల్లో ఈ చెట్టుని ఇళ్లల్లో పెట్టి కొవ్వొత్తులు, విద్యుద్దీపాలు, రకరకాల వస్తువులతో అందంగా అలంకరిస్తారు. క్రిస్మస్ చెట్టు పైభాగంలో నక్షత్రం ఏర్పాటు చేస్తారు. చారిత్రకంగా క్రిస్మస్ చెట్టుని పరిశీలిస్తే ఈ సంప్రదాయం 1781లో బెన్సివిక్ సైనికుల ద్వారా కెనడాలోకి ప్రవేశించిందని చెబుతారు. "జనరల్ ఫెడరిక్ అడాల్ఫ్ రెడిజిల్" అనే సైనికాధికారి ఇచ్చిన క్రిస్మస్ విందులో అతిథులను అబ్బురపరచటం కోసం "ఫర్" చెట్టుని కొవ్వొత్తులతో, పండ్లతో అలంకరించాడట. 19వ శతాబ్ద ప్రారంభంలో ఈ సంప్రదాయం ప్రాచుర్యం పొందింది. ఆ తర్వాత రష్యాలాంటి దేశాల్లోనూ సంపన్న కుటుంబాలవారు క్రిస్మస్ చెట్టుని ఉపయోగించటం మొదలుపెట్టారు. 1816లో "నస్సావో-విల్‌బర్గ్" యువరాణి హెన్‌రేటా క్రిస్మస్ చెట్టుని వియన్నా దేశానికి పరిచయం చేసింది. ఆ తర్వాత కాలంలో ఈ సంప్రదాయం ఆస్ట్రియాకి విస్తరించింది. 1840లో డచ్ వారి ద్వారా ఈ చెట్టు ఫ్రాన్స్‌లోకి వచ్చింది. బ్రిటన్‌లోకి 19వ శతాబ్ద ప్రారంభంలో క్రిస్మస్ సంప్రదాయంలో భాగమైంది. రాణి విక్టోరియా.. తనకు చిన్నప్పటి నుంచి ఈ చెట్టుతో అనుబంధం ఉన్నట్టు ఒక పత్రికలో పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలో ప్రపంచవ్యాప్తంగా కిస్మస్ చెట్టు ప్రసిద్ధి చెందింది. ఇంతేకాకుండా.. దీనికి సంబంధించి ఒకటి రెండు కథలు కూడా ప్రాచుర్యంలో వున్నాయి.

క్రిస్మస్ కేకు

క్రిస్మస్‌కి కేకు తయారుచేయడం అనేది పూర్తిగా పాశ్చాత్య సంప్రదాయం. పాశ్చాత్యుల విందు భోజనాల్లో కేక్ ఒక అంతర్భాగం. ఇక పుట్టినరోజు, పెళ్లిరోజుల వంటి ప్రత్యేక సందర్భాల్లో కేక్‌ను కట్ చేయించడం వారికి అలవాటు. అందుకే ఎంతో ముఖ్యమైన క్రిస్మస్‌కి కూడా కేక్ కట్ చేసే సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు. బ్రిటిష్ వారు పరిపాలించిన అన్ని దేశాల్లోకీ ఈ సంప్రదాయం విస్తరించింది. క్రిస్మస్ కేక్ అంటే ప్రసాదం లాంటిదేమీ కాదు. అదొక రుచికరమైన ఆహార పదార్థం మాత్రమే. అందరూ నోటిని తీపి చేసుకుని సరదాగా ఆనందించడానికే తప్ప దీని వెనుక ప్రత్యేకమైన కారణమేదీ వున్నట్లు కనబడదు.

గ్రీటింగ్ కార్డ్

క్రిస్మస్‌కి గ్రీటింగ్ కార్డులను పంపించుకోవడం ఒక ఆనవాయితీగా వుంది. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగిన తర్వాత గ్రీటింగ్ కార్డులకు కొంత డిమాండ్ తగ్గినా పూర్తిగా మాత్రం తగ్గలేదు. ఆ మేరకు ఇమెయిల్స్, సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుకోవడం, గ్రీటింగ్స్ పోస్ట్ చేయడం సర్వసాధారణమైంది. ప్రపంచంలో మొట్టమొదటి గ్రీటింగ్‌కార్డ్ రూపకర్త పేరు జాన్ కాల్‌కాట్ హర్సిలీ. 1843లో క్రిస్మస్ పండుగ సందర్భంగా బ్రిటన్‌కు



భారీ క్రిస్మస్ చెట్టు

బ్రెజిల్‌లోని రియో డి జెనీరో నగరంలో రోడ్రిగో డి ఫ్రీటస్ లాగూన్‌లో ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే అతిపొడవైన, నీటిపై తేలియాడే క్రిస్మస్ చెట్టు ఇది. 85 మీటర్ల పొడవు, 542 టన్నుల బరువు ఉన్న ఈ చెట్టు 31 లక్షల విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగులు విరాజిల్లుతోంది. జనవరి 6వరకు మెరిసిపోనున్న ఈ క్రిస్మస్ చెట్టు ప్రపంచంలోనే అతిపెద్దదని గిన్నిస్ బుక్ రికార్డు కూడా ఇచ్చేశారు.

చెందిన సర్ హెన్రీకల్ ఆయనను ఈ పనికి పురమాయించాడు. కాసింత భావుకత, పేదవారి పట్ల అభిమానమున్న హెన్రీ తాము తయారు చేయబోయే అభినందనల కార్డ్‌లో పేదవారి ఆహారం, దుస్తులు, నివాసం లాంటి వాటిపైన ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిందిగా హార్స్‌లీని కోరాడు. ఒక కుటుంబంలోని సభ్యులంతా కూర్చుని ఆనందంగా వైన్ సిప్ చేస్తున్నట్లు, సంతోషంతో క్రిస్మస్ వేడుకను చేసుకుంటున్నట్లు బొమ్మవేసి దానిపై "ఎ మెర్రీ క్రిస్మస్ అండ్ హ్యాపీ న్యూ ఇయర్ టు యూ" అనే క్యాప్షన్ రాశాడు. హెన్రీ మరుసటి సంవత్సరం కార్డు లెవ్వరికీ పంపలేదు. అయితే హార్స్‌లీ, హెన్రీ చేసిన పని అందర్నీ ఆకట్టుకొంది. ఆ తర్వాతి సంవత్సరం నుండి అందరూ అదొక సంప్రదాయంగా పాటించడం మొదలెట్టారు. మొదటి కార్డును తయారుచేసింది జాన్ హార్స్‌లీ అయితే, అసలు కార్డు తయారు చేయించాలనే ఆలోచన చేసింది మాత్రం హెన్రీ కోలె. వీరిద్దరూ చరిత్రలో అరుదైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

శాంతాక్లాజ్

క్రిస్మస్ పండుగ అంటే.. పిల్లలందరికీ ఎంతో ఆనందం... ఉత్సాహం... ఒకవైపు కొత్త బట్టలు... మరోవైపు కమ్మని రుచికరమైన కేకులు.. డోనట్స్... కుక్కీస్... అబ్బో... ఎంతో వేడుక! పిల్లల్ని బాగా ఆకర్షించేది క్రిస్మస్ తాత! షాపింగ్ వెళితే అక్కడ క్రిస్మస్ తాత కనిపిస్తాడు. ఆ ఒక్క చోటేమిటీ... స్కూల్ క్రిస్మస్ డ్రామాలో, సెమీ క్రిస్మస్‌లో ఎక్కడ చూసినా క్రిస్మస్ తాత హడావుడి అంతా ఇంతా కాదు. ఇంత హడావుడీ చేస్తున్నా... అసలీ క్రిస్మస్ తాత అంటే ఎవరో చాలామందికి తెలియదు. ఈయనను శాంతాక్లాజ్ అనీ, ఫాదర్ నికోలస్ అనీ, ఫాదర్ క్రిస్మస్ అనీ పిలుచుకుంటారు. దేశం ఏదైనా అక్కడి పిల్లలకు మాత్రం క్రిస్మస్ తాత ఉండాల్సిందే! అమెరికా, ఐరోపా, ఇంగ్లాండు, ఫ్రాన్స్, జపాన్ దేశాలలో క్రిస్మస్ తాతకు మంచి గిరాకీ వుంది. క్రిస్మస్‌కు ఆరు నెలల ముందు నుండే మంచు పర్వతాలను దాటుకొని, ప్రత్యేకమైన బండీని రీకడీర్స్ అనే జింకలు లాగుతూ తీసుకొని వస్తాయట. పొడవాటి తెల్లని గడ్డం, ముఖాన్ని కప్పి వేసే తెల్లని మీసాలు, ఎరుపురంగు కోటుకు తెల్లని ఫర్ క్లాత్‌తో లైనింగ్ చేసిన దుస్తులు ధరిస్తాడు. బానడంత పొట్టతో చలిపాక్సీ వేసుకుని చాలా వింతగా ఉంటాడు. భుజంపైన పెద్ద సంచితో పిల్లలకు ఇష్టమైన చాక్లెట్లు, చిక్కీలు, బిస్కట్లు, మంచి కథల పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు వంటి అనేక బహుమతులు తీసుకొస్తాడు. ఫ్రాన్స్‌లో పిల్లలు శుభ్రమైన మేజోళ్ళను తమ గది కిటికీలకు వేలాడదీస్తారు. రాత్రిళ్లు క్రిస్మస్ తాత ఆ మేజోళ్ళలో స్వీట్లు, ఇతర బహుమతులు వేస్తాడని వారి విశ్వాసం.

సంగీతం

క్రిస్మస్ వేడుకల్లో సంగీతానికి చాలా ప్రాముఖ్యత వుంది. కొత్తకొత్త బాణీలు, సంగీత వాయిద్యాలతో పాటలను రూపొందిస్తారు. ఇది ఈనాటిది కాదు. 4వ దశాబ్దంలోనే రోమ్‌లో 'క్రిస్మస్ హిమ్స్' బాణీలు కట్టుకున్నాయి. మిలాన్ అర్చి బిషప్, అంబ్రోస్ రచించిన "వెనిరి డెంప్టర్ జెన్షియం" అనే లాటిన్ భాషలోని "హిమ్", 'స్పానిష్ కవి ప్రుడెన్షియస్ రాసిన "కార్డ్ నాటస్ ఎక్స్ పేరంటీస్" (ఆఫ్ ది ఫాదర్స్ లవ్ బిగాటెన్) వంటి పురాతన క్రైస్తవ భక్తి గీతాలు నేటికీ భారతదేశంలోని చర్చిలలో కూడా వినిపిస్తూ వుంటాయి. తొలిసారిగా 1426లో ష్రోప్‌షైర్ చాప్లెయిన్‌గా సుప్రసిద్ధుడైన జాన్ ఆడ్లే రచనలతో ఇంగ్లీష్‌లో కూడా క్రిస్మస్ కేరల్స్ రూపుదిద్దుకున్నాయి. ఇంటింటికీ తిరుగుతూ, 'కేరల్స్ ఆఫ్ క్రిస్మస్' గానం చేసేవారు. మామూలుగా జానపదులు పంటకోతల సమయంలోనూ, క్రిస్మస్ పండుగ సందర్భంలో ఇళ్లలోనూ పాడుకునే ఈ గీతాలు కాలక్రమంలో చర్చిలకు కూడా వ్యాపించాయి. సంప్రదాయికంగా వస్తోన్న కేరల్స్ అనేవి మంద్రస్వరంతో ఆలపించే గీతాలే. అంచేత ఆ గీతాలు ఎంతో సుకుమారంగా, సున్నితంగా వినిపిస్తాయి. 'పెర్మనెంట్ హోడీ', "గుడ్ కింగ్ వెన్సెస్ లాస్', 'ది హోలీ అండ్ ది ఐవీ' వంటి గీతాలు మధ్య యుగానికి చెందినవే. ఈ సంగీత స్వర ఝురులన్నీ నేటికీ కొత్తదనం సంతరించుకొని మరీ వినిపిస్తున్నాయి.

- జేవియర్ కంచర్ల

లిటిల్ స్టార్

పిల్లహీరోల పేర్లేంటో ?

ఈ చిత్రంలో కోలముఖంతో, కొంటె నవ్వుతో కనిపిస్తున్న బుడతలిద్దరూ ఇప్పుడు టాలివుడ్ యువహీరోలుగా చలామణవుతున్నవారే. వీరు వరుసకు బావబామ్మరుదులు. అంతేకాదు... అంతకు మించి మంచి స్నేహితులు. వీరిద్దరి తాతలూ సినీపరిశ్రమకు సుపరిచితులే. టాలీవుడ్‌కు లీడర్‌గా వచ్చి, బాలివుడ్‌లో దమ్ మారో దమ్ అంటూ పలకరించిన ఈ యువకథానాయకుడు ప్రతినాయకుడు పాత్రలూ పోషిస్తుంటే ..... తెలుగుచిత్రసీమకు ' జోష్ 'గా వచ్చి తడాఖా చూపించాడు మరో యువహీరో. ఇప్పుటికైనా ఈ పిల్లహీరోలెవరో గుర్తుపట్టారా ? .....

అయితే సమాధానం కోసం 21వ పేజీ చూడండి .

సమ్థింగ్ స్పెషల్

తొందర పడకండి, వెంటనే పెట్టుబడి పెట్టినట్లు, ఆదాయం పొందినట్లు కలలు కనకండి. కానీ ఇది నిజం అంటున్నారు అమెరికాలోని సన్‌లైట్ ఫౌండేషన్ అనే సంస్థ వారు. అక్కడి బడా సంస్థలు ఎన్నికలు, ఇతరత్రా రాజకీయంగా ప్రభావితం చేసేందుకు విరాళాలు, లంచాల రూపంలో ఖర్చు చేసిన ప్రతి డాలర్‌కు ప్రభుత్వ సంస్థలతో జరిపే వ్యాపారం, ప్రభుత్వ మద్దతు రూపంలో 760 డాలర్ల లబ్ది పొందినట్లు సదరు సంస్థ ఇటీవల ఒక విశ్లేషణా నివేదికను విడుదల చేసింది. ఇలా లబ్ది పొందిన వాటిలో మాన్ శాంటో, బేయర్, డౌ వంటి జన్యుమార్పిడి, ఆగ్రో కెమికల్ కంపెనీలు ఎక్కువగా ఉన్నాయి. మీరు అమెరికాలో పుట్టి వుంటే, మీకూ ఒక పెద్ద కార్పొరేషన్ ఉండి ఉంటే అంత లాభం మీకూ వచ్చి ఉండేది. ఎందుకంటే కంపెనీలు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలపై ఆంక్షలు అవసరం లేదని నాలుగు సంవత్సరాల క్రితం ఏకంగా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఇలా చేయటం అవినీతా అంటే దాని దృష్టిలో కానే కాదు. పర్యవసానంగా 2012,14 ఎన్నికలు ఎంతో ఖరీదైనవిగా చరిత్రకెక్కాయి. లాభం లేనిదే వ్యాపారి వరదన పోడన్న సామెత తెలిసిందే. అపరిమిత లాభాలు వస్తున్న కారణంగా అంతగా కంపెనీలు ఖర్చు చేస్తున్నాయి.



పెట్టుబడిపై 760 రెట్ల ఆదాయం!

ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లుగా స్థాయిని బట్టి కంపెనీలు విరాళాలు ఇస్తున్నాయి. ఏడాది పాటు రెండు వందల బడా కంపెనీల ఖర్చులను శోధించగా 2007–2012 మధ్య 580 కోట్ల డాలర్లు విరాళాలుగా వెదజల్లి ప్రతిఫలంగా 4.4లక్షల కోట్ల డాలర్లు పొందినట్లు సన్‌లైట్ ఫౌండేషన్ గుర్తించింది. అధికారంలో ఎవరున్నారనేదానితో నిమిత్తం లేకుండా కంపెనీలు ఖర్చు చేస్తున్నాయి. అందుకే పార్టీలు తామే అధికారంలో ఉండాలని పోటీబడుతున్నాయని ఈ పాటికి అర్ధమయ్యే ఉంటుంది. చిత్రమేమంటే ఫెడరల్ ప్రభుత్వం ఇదే కాలంలో ఐదుకోట్ల మంది సామాన్య పౌరులకు సామాజిక భద్రతా పథకాలకు చేసిన ఖర్చు 4.3లక్షల కోట్ల డాలర్లు మాత్రమేనని ఆ నివేదిక వాపోయింది.

2012 అధ్యక్ష ఎన్నికలలో లెక్కల్లో చూపిన మొత్తం ఖర్చు 630 కోట్ల డాలర్లు కాగా, ఈ ఏడాది జరిగిన మధ్యంతర ఎన్నికలలో అది కాస్తా 400 కోట్లు దాటింది. వచ్చే 2016 ఎన్నికలు ఎంత ఖర్చుకు తెరతీస్తాయో చూడాలి. అన్నట్లు 200 కంపెనీలలో 29 అయితే ఒక డాలరుకు వెయ్యి డాలర్ల సూపర్ లాభం పొందాయట. కనిష్టంగా పది రెట్లు పొందని కంపెనీ లేదట. పైన పేర్కొన్న మొత్తం లావాదేవీల రూపంలో పొందిన లబ్ది మాత్రమే. ఇవిగాక లెక్కలోకి రాని, విలువను లెక్కించలేని పర్యావరణ,కార్మిక, పన్ను మినహాయింపుల వంటి పరోక్ష లాభాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు వాల్‌మార్ట్ కంపెనీ తన దగ్గర పనిచేసే తక్కువ వేతన సిబ్బందికి ఆహారం కోసం విరాళాలు ఇవ్వాలని సెలవుల రోజుల్లో హుండీలు పెడుతుంది. తన సొమ్ము ఖర్చు చేయకుండా లాభపడటమే ఇది.ఇరవై ఒక్క కంపెనీలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన రాయితీల విలువను లెక్కించలేమని సన్‌లైట్ ఫౌండేషన్ తెలిపింది. టెన్నెసీ వాలీ అథారిటీ విద్యుత్ ఉత్పత్తికి గాను బొగ్గుపై ఎంత లబ్ది పొందిందీ ఎంత బొగ్గు తవ్విందీ వెల్లడించలేదు. ఆక్సిడెంటల్ పెట్రోలియం కంపెనీకి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన భూమి నుంచి ఎంత సహజవాయువును తీసిందీ, దానికి ఎంత మొత్తం ప్రతిఫలంగా చెల్లించిందీ వివరాలు లేవు. ప్రభుత్వం కూడా వివరాలు వెల్లడించలేదు.

ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపన కలిగించే పేరుతో గత ఏడు సంవత్సరాలుగా తీసుకుంటున్న చర్యలు కార్పొరేట్ కంపెనీల లాభాలు పెంపొందటానికి, స్టాక్‌మార్కెట్‌లో వాటి వాటాల ధరలు పెరగటానికి తప్ప సామాన్యులు కోల్పోయిన దానిని తిరిగి పొందటానికి ఉపయోగపడలేదని నివేదిక వ్యాఖ్యానించింది.

కార్పొరేట్ కంపెనీలు ఎన్నికల సందర్భంగా చేసే ఖర్చు అవినీతి పెరగటానికి లేదా అవినీతి జరిగినట్లు కనిపించటానికి వీలు లేకుండా ఉండాలని కూడా సుప్రీం కోర్టు విరాళాలపై ఆంక్షలు అవసరం లేదన్న తీర్పులో పేర్కొన్నది. ఆ తీర్పు తరువాతే కంపెనీల ఖర్చు విపరీతంగా పెరిగింది. తమ పనులు చేసి పెట్టేవారి(లాబీయిస్టులు) పేరుతో కంపెనీలు అధికారికంగా లంచాలు ఇచ్చే వారిని నియమించుకుంటాయి. అలాంటి వారిలో 20,500 మంది ఖర్చులను విశ్లేషించగా 144 మంది ప్రస్తుత ఎంపీలకు కూడా గణనీయంగా ఖర్చు చేసినట్లు తేలింది. సన్‌లైట్ సిబ్బంది కోటీ 40లక్షల రికార్డులను పరిశీలించారు.

కార్పొరేట్, ధనికులు తమ ప్రయోజనాలు నెరవేర్చుకొనేందుకు, పలుకుబడిని ఉపయోగించేందుకు ఇచ్చే విరాళాలపై ఉన్న ఆంక్షలను గుట్టుచప్పుడు కాకుండా సడలించినట్లు ప్రభుత్వ పత్రాలలో వెల్లడైంది. ఇంతవరకు ఒక వ్యక్తి గరిష్టంగా ఒక ఏడాదికి లక్షా 29,600 డాలర్లు(అమెరికా మధ్యస్థ ఆదాయానికి రెండున్నర రెట్లు) విరాళంగా ఇవ్వవచ్చని నిబంధనలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 7,77,600 డాలర్లు ఇవ్వవచ్చు. ఇవిగాక పార్టీ సభలకు ఇచ్చే మొత్తాన్ని 32,400 నుంచి97,200 డాలర్లకు పెంచారు. పార్టీల జాతీయ కమిటీలు తమకు వచ్చే విరాళాలను ప్రత్యేక ఖాతాలు, ప్రత్యేక భవనాలకు తీసుకోవచ్చని మినహాయింపు ఇచ్చారు. ఇవన్నీ కార్పొరేట్లనుంచి వచ్చిన డబ్బును సర్దుబాటు చేసే ఎత్తుగడలు తప్ప మరొకటి కాదు.

- సత్య

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

(భాగం -16)

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

'బానిస వ్యవస్థ' లాంటి ఆర్థిక వర్గీకరణలను సరిగా అర్థం చేసుకోనందుకు కూడా ప్రూధోను విమర్శించాడు మార్క్స్. "ఆధునిక పారిశ్రామిక వ్యవస్థకు యంత్రీకరణ ఎంత సహాయం చేసిందో, బానిస వ్యవస్థ కూడా అంతే సాయం చేసింది. బానిస వ్యవస్థ లేకపోతే పత్తి సేకరణ లేదు. పత్తి లేకపోతే ఆధునిక యంత్రీకరణ జరిగేది కాదు. బానిస విధానం వల్లనే వలసలు పెరిగాయి. వలస దేశాలు ఏర్పడ్డాయి. బానిసల వల్లనే అక్కడి సంపద పెరిగింది. వలస దేశాల వల్లనే అంతర్జాతీయ వాణిజ్యం ఆవిర్భవించింది. అంతర్జాతీయ వాణిజ్యం లేకపోతే బడా పరిశ్రమలు వచ్చేవే కావు."

అంతటితో ఆగలేదు. ప్రూధోను ఎండగడుతూ మరో పుస్తకం 'ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ' రాశారు. ఇందులో ప్రూధోని విమర్శించడం ఒక పార్శ్వం మాత్రమే. ఆ క్రమంలో తన సొంత చారిత్రక, ఆర్థిక, విప్లవ సిద్ధాంతాలను కూడా వివరించాడు మార్క్స్. తాను సొంతంగా రాసిన తొలి పుస్తకమిది. ఇందులోనే తొలిసారిగా తాను 'ఎకానమిస్టు' నని ప్రకటించుకున్నాడు.

"బూర్జువా ఉత్పత్తి సంబంధాలలో ఒక వైరుధ్యం ఉన్నదని స్పష్టమవుతోంది. సంపదను పెంచిన ఉత్పత్తి సంబంధాలే పేదరికాన్ని సృష్టించాయి. అభివృద్ధి జరిగిన దశలోనే వెనకబాటుతనమూ పెరిగింది. బూర్జువా సంపదను, బూర్జువా వర్గాన్ని సృష్టించిన సంబంధాలే కార్మిక వర్గాన్నీ సృష్టించాయి.

ప్రూధో రాసిన పుస్తకం (ది ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ) ఫ్రాన్సులో బాగా అమ్ముడుపోయింది.

" మార్క్స్ మూడవ సంతానం ఎడ్గార్ ఫిబ్రవరి 3 నాడు జన్మించాడు. కుర్రవాడు అందగాడేమీ కాదు గాని జెన్నీ వాడ్ని ముద్దుగా 'లిటిల్ మాన్స్టర్' అని పిలిచింది. మార్క్స్ కూడా పుత్రోత్సాహంతో ఉల్లాసంగా వున్నాడు మరోపక్క ఆర్థిక సమస్యలు వెంటాడుతూనే వున్నాయి. ఇప్పుడు ఇంట్లో ముగ్గురు పిల్లలూ, అయిదుగురు పెద్దవాళ్ళూ (లెంచెన్, పాలరాయి, జెన్నీ తమ్ముడు ఎడ్గార్ వెస్ట్ ఫాలెన్‌తో కలిసి) ఉత్తర ప్రత్యుత్తరాల ఖర్చు కూడా పెరిగిపోయింది. (పారిస్‌లో పార్శిల్ పంపాలంటే ఆరు ఫ్రాంకులు చెల్లించాలి) కుటుంబ సభ్యులే కాక, భోజన సమయంలో టేబుల్ దగ్గర వున్న వాళ్లందరికీ ఏదో ఒకటి కొనాలి. ఎన్ని ఇబ్బందులున్నా, తమ ఖర్చుల గురించి ఎవరికీ చెప్పకోలేదు. "

జర్మన్‌లోకి కూడా అనువాదమైంది. కాని మార్క్స్ విమర్శనా గ్రంథం 'ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ ' కి మాత్రం పబ్లిషర్ దొరకలేదు. అయితేనేం డబ్బుల కోసం కటకటగా ఉన్న దశలో కూడా సొంత ఖర్చులతో ఎనిమిది వందల ప్రతులు అచ్చు వేయించాడు. పెద్దగా అమ్ముడు పోలేదు. కాని మార్క్స్ అవగాహనా క్రమంలో ఇదో ముఖ్యమైన రచన. దీనితో ఆయనకో స్పష్టత వచ్చింది. ఇన్నాళ్ళూ పాత సోషలిజం, కమ్యూనిజం, హెగెలియజం, క్రిస్టియానిటీ, జుడాయిజంలకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో విజయం సాధించాడు. నూతన రాజకీయ-ఆర్థిక-సామాజిక వ్యవస్థల గురించి తన సిద్ధాంతాలు ప్రతిపాదించటానికి మార్గం సుగమమైంది. కేవలం సిద్ధాంతాలు కాదు - సామాజిక మార్పుకు కార్యాచరణ అంతకన్నా ముఖ్యం.

చారిత్రకంగా యిక తనకు తాను విప్లవీకరించుకునే సమయం వచ్చింది. ఈ ఆలోచనతో తనూ, జెన్నీ, బ్రసెల్స్‌లో వున్న ఇతర మిత్రులూ 'లీగ్ ఆఫ్ జస్ట్'లో సభ్యత్వం తీసుకున్నారు.

బ్రసెల్స్, 1847

'లీగ్ ఆఫ్ ది జస్ట్' కేంద్ర కార్యాలయం పారిస్‌లో ఉంది. కాని 1846 శిశిర కాలం వరకు పోలీసుల బెడద పెరగడంతో, ముఖ్య సభ్యులందరూ ఫ్రాన్సు విడిచి వెళ్ళారు. లండన్‌లో ప్రభుత్వ ఆంక్షలు లేవు. స్వేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. మరో ముఖ్య కారణం ఇక్కడ ఈ సంస్థకెవరూ అంత ప్రాముఖ్యత ఇవ్వరు.

1846 ప్రారంభంలోనే మార్క్స్, లీగ్ ఆఫ్ ది జస్ట్‌ను తమ కరస్పాండెన్స్ కమిటీతో కలిసిపొమ్మని అడిగాడు. కాని తోటి సోషలిస్టులు, కమ్యూనిస్టుల పట్ల అంత దురుసుగా ప్రవర్తిస్తున్న ఈ ముక్కోపితో కలిసి పనిచెయ్యటం వీలు పడుతుందా? లీగ్ మొదట ఈ ప్రతిపాదనను నిరాకరించినా, ఊహాజనితమైన లక్ష్యాల కోసం కాక, శాస్త్రీయ అవగాహనతో పని చెయ్యవలసిన అవసరం ఉందన్న మార్క్స్ వాదన్ను అంగీకరించారు. 1847 ఫిబ్రవరిలో జోసెఫ్ మాల్ అనబడే లీగ్ ఆఫ్ ది జస్ట్ సభ్యుని కోరిక మన్నించి మార్క్స్, ఎంగెల్స్‌లు ఆ సంస్థతో కలిసి పని చేయటానికి అంగీకరించారు.

ఊహాలోకాల్లో బతకొద్దని మార్క్స్ హెచ్చరించటానికి కారణం అప్పటి ఆర్థిక, వ్యవసాయక సంక్షోభం. యూరోప్ అంతటా పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు కరవుతో అల్లాడుతున్నారు. ఫలితంగా ఎవరికోసం పని చెయ్యాలనుకుంటున్నరో, వారిని ఆకర్షించలేకపోయింది లీగ్. 1845లో ప్రారంభమైన బంగాళాదుంప తెగులు ఇతర పంటలకూ పట్టి చీడపీడలతో చిన్న రైతులు నిలువునా మునిగారు. దీనికితోడు ప్రభుత్వాలు పెద్ద రైతులకనుకూలంగా కొత్త వాణిజ్య విధానం ప్రకటించాయి. దాంతో రైతులు తమ ఉత్పత్తులను స్థానిక మార్కెట్లలో అమ్మటానికి బదులు విదేశీ మార్కెట్లకు తరలించడం ప్రారంభించారు. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. దివాళా తీసిన చిన్న రైతులు, వ్యాపారస్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. కాస్త వున్న వాళ్లకు కూడా ఆహారం తప్ప మరే వస్తువులూ కొనే స్తోమత లేకుండా పోయింది. దాంతో వ్యాపారస్తులు దివాళా తీయటానికి దారితీసింది. నగరాలలో క్షామ పరిస్థితులు కనిపించాయి. చలికాలం, పారిస్‌లోని పది లక్షల మందిలో మూడవవంతు జనాభా స్థానిక దాతలు, కాథలిక్ చర్చి, ఇతర సేవా సంఘాల ఉచిత భోజన సౌకర్యాల మీద బతికారు. ఆహార దాడులు జరిగాయి. కార్మికులు సమ్మె చేశారు. పరిస్థితి చేయిదాటకుండా వుండాలని, ప్రభుత్వం కొంత ఆహార నిల్వల్ని, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు తరలించింది. ఇది పరిష్కార మార్గం కాకపోగా... గ్రామాల్లో యుద్ధ వాతావరణం ఏర్పడటానికి ప్రధాన కారణమైంది.

'పాత వ్యవసాయ పద్ధతులకు చరమగీతం పాడిన చారిత్రక క్షణమిది' అని వ్యాఖ్యానించారొకరు. కేవలం పంట దిగుబడుల మీద ఆధారపడి కుటుంబాల హోదా పెరిగింది లేదా తగ్గింది. డబ్బు సంపాదించాలంటే యిక వ్యవసాయం లాభం లేదు. మంచికో, చెడుకో వ్యాపారాన్ని నమ్ముకోవాలి. కాని 1847లో యూరోపియన్లు ఈ రెండు రంగాల్లోనూ దగా పడ్డారు.

మార్క్స్ సభ్యత్వం తీసుకున్న తొలి కార్మిక సంస్థ లీగ్ ఆఫ్ జస్ట్. నిజానికి ఆయనకు సంస్థలన్నా, బహిరంగ రాజకీయాలన్నా యిష్టముండదు. స్వభావరీత్యా అతడు రచయిత, మేధావి. సంస్థాగత జీవితానికి అవసరమైన వ్యవహార చతురత, సహనం అతడికి లేవు. తన ఇష్టానికి వ్యతిరేకంగా, మార్క్స్ జీవితాంతం ఏదో ఒక సంస్థతో ముడిపడే వున్నాడు. అంతేకాదు. నాయకత్వ బాధ్యతలు కూడా నిర్వహించాడు.

మార్క్స్ మూడవ సంతానం ఎడ్గార్ ఫిబ్రవరి 3 నాడు జన్మించాడు. కుర్రవాడు అందగాడేమీ కాదు గాని జెన్నీ వాడ్ని ముద్దుగా 'లిటిల్ మాన్స్టర్' అని పిలిచింది. మార్క్స్ కూడా పుత్రోత్సాహంతో ఉల్లాసంగా వున్నాడు. మరోపక్క ఆర్థిక సమస్యలు వెంటాడుతూనే వున్నాయి. ఇప్పుడు ఇంట్లో ముగ్గురు పిల్లలూ, అయిదుగురు పెద్దవాళ్ళూ (లెంచెన్, పాలడాయి, జెన్నీ తమ్ముడు ఎడ్గార్ వెస్ట్ ఫాలెన్‌తో కలిసి). ఉత్తర ప్రత్యుత్తరాల ఖర్చు కూడా పెరిగిపోయింది. (పారిస్‌లో పార్శిల్ పంపాలంటే ఆరు ఫ్రాంకులు చెల్లించాలి) కుటుంబ సభ్యులే కాక, భోజన సమయంలో టేబుల్ దగ్గర వున్న వాళ్లందరికీ ఏదో ఒకటి కొనాలి. ఎన్ని ఇబ్బందులున్నా, తమ ఖర్చుల గురించి ఎవరికీ చెప్పుకోలేదు. మార్క్స్, జెన్నీ, మార్క్స్ అవమానించటంతో బాధపడ్డ వేట్లింగ్, ఆ తర్వాత రోజు వాళ్లతో కలిసే లంచ్ చేశాడు! ఉద్యమం వ్యక్తి కన్నా గొప్పది కనుక త్యాగం చెయ్యక తప్పదనే వాడు మార్క్స్. ఎంగెల్స్ ద్వారా పారిస్‌లో మిత్రుల నుండి రావాల్సిన బాకీ డబ్బులు కొన్ని రాబట్టుకున్నాడు. అవేపాటికి సరిపోతాయి. 'పొలిటికల్ ఎకానమి' పుస్తకం ద్వారా రావు. ఫిబ్రవరిలో ఈ విషయమై కుదుర్చుకున్న ఒప్పందం రద్దు చేసుకున్నాడు పబ్లిషర్. ఆ ఆదాయం వస్తుందనుకొని చేసిన అప్పులు మాత్రం మిగిలాయి.

త్యాగం అనివార్యం. కాని లేఖల్లో, మార్క్స్ అనుభవిస్తున్న కష్టాల్ని పట్టించుకున్నట్టు కనపడదు. కొన్నిసార్లు జెన్ని గురించి విస్మరించినట్టే వుంటుంది. సోషలిస్టులతో సంబంధాలు పెంచుకుంటూ, కార్మికుల్లో రాజకీయ చైతన్యం పెంచుతూ ఇంకా పారిస్‌లోనే వున్నాడు ఎంగెల్స్.

"హాలండ్‌లో మార్క్స్‌కు డబ్బు దొరుకుతుందనే వాగ్దానం లభించింది గాని అప్పటికి ఖాళీ చేతుల్తోనే తిరిగి వచ్చాడు. బ్రసెల్స్‌లో అనూహ్యమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలిసినా, లీగ్ సమావేశం యొక్క అవసరాన్ని గురించి, భార్యను ఒంటరిగా వదిలి, లండన్‌కు బయల్దేరాడు మార్క్స్. ఆ సందర్భంగా పారిస్‌లో వుంటున్న పావెల్ అన్నెకోవ్‌కు ఇలా రాశాడు. "నా ఆర్థిక స్థితి దారుణంగా వుంది. అప్పుల వాళ్లు నా భార్యను రోజూ వేధిస్తున్నారు. అడగాలంటే సిగ్గుగా వుందిగాని, నా భార్యకు వందో రెండు వందలో ఫ్రాంకులు పంపగలిగితే, నాకు మహోపకారం చేసిన వాడవవుతావు. అయితే మొత్తం నేను త్వరగా తిరిగి ఇవ్వలేను. ఆర్థిక స్థితి మెరుగుపడిన తర్వాత మాత్రమే బాకీ తీర్చగలను" ప్రతిపాదన అంగీకరిస్తే, అన్నెకోవ్ ఆ డబ్బు జెన్నీకి పంపాలి. "నేనీ ఉత్తరం రాసిన విషయం నా భార్యకు తెలియకూడదు. మంచి వార్తలు మరోసారికి..."

మార్క్స్, ఎంగెల్స్

మార్చిలో రాసిన ఒక లేఖలో, రాజకీయ పరిస్థితి ఆందోళనకరంగా మారబోతుందని మార్క్స్‌ను హెచ్చరించాడు. "పోలీసులు రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తిస్తున్నారు. ఆహార కొరత సాకుగా అల్లర్లు చెలరేగితే ఏర్పడే పరిస్థితిని వాళ్లకనుకూలంగా మార్చుకోవాలనుకుంటున్నారు". కొందరు కమ్యూనిస్టుల్ని అప్పటికే అరెస్టు చేశారు. మరికొందరిపై కేసులు పెట్టారు. 'బోరింగ్' బ్రసెల్స్‌ను వదిలి పారిస్‌కు రమ్మని మార్క్స్‌కు గాలం వేశాడు ఎంగెల్స్. అయితే కారణం విప్లవ విధ్వంసం కాదు. ఒకవేళ అది విధ్వంసమే అనుకుంటే సంసారాలను కూల్చే విధ్వంసం. ఏప్రిల్‌లో తనకు డబ్బులొస్తాయి. "ఇంకేం, మనం అన్నీ మరచి ఎంజాయ్ చేయవచ్చు.... అన్ని విషయాలూ మాట్లాడుకోవటానికి నా మిత్రబృందంలో మీరు తప్ప ఎవరూ లేరు. తప్పక రావాలి." అంటూ ఉత్తరం రాశాడు ఎంగెల్స్.

అయినా సరే, మార్క్స్ పారిస్‌కు వెళ్లలేదు. వెళ్లటానికి ఆయన దగ్గర డబ్బూ లేదు. సమయమూ లేదు. బెల్జియంలో కూడా రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా వుంది. ప్రష్యన్ ప్రభుత్వం, అక్కడ వుంటున్న తన పౌరులు యిచ్చిన వాగ్దానాలను ఉల్లంఘించి రాజకీయాల్లో పాల్గొంటున్నారని ఆరోపించింది. 'ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ ప్రచురించమని మార్క్స్ అడిగిన జర్మన్ పబ్లిషర్ కార్ల్ వాగ్లర్‌ను ఏప్రిల్‌లో అరెస్టు చేశారు. బెల్జియన్ ప్రతిపక్ష పార్టీ వార్తా పత్రిక డాయిష్ బ్రసెలర్ జైటుంగ్‌కు వ్యాసాలు రాయటం ప్రారంభించాడు మార్క్స్. అవి రాజకీయ పరమైన ఆర్టికల్స్ కానప్పటికీ, అధికారుల దృష్టిని ఆకర్షించాయి. తన మీద నిఘా పెరిగిందనిపించింది.

జూన్‌లో లీగ్ సభ్యులు, సంస్థాగత విషయాలు చర్చించటానికి లండన్‌లో సమావేశం కాబోతున్నారు. పారిస్ రావాలని ఉన్నా వచ్చే పరిస్థితిలో లేనని ఎంగెల్స్‌కు స్పష్టం చేశాడు మార్క్స్. (పావర్టీ ప్రచురణ డబ్బులు తనే

భరిస్తున్నాడు.) పాస్‌పోర్ట్ సమస్య కూడా వుంది. మరో పక్క అధికారులు కన్నేసి ఉంచారు. ఏ చిన్న కారణం దొరికినా తనను ఇబ్బంది పెట్టడం ఖాయం. బ్రసెల్స్ శాఖ ప్రతినిధిగా లూపస్, ఫ్రెంచి ప్రతినిధిగా ఎంగెల్స్ వెళ్ళాలి.

డజన్ల కొద్దీ లీగ్ సభ్యులు లండన్‌లోని ఒక ప్రైవేటు గదిలో సమావేశమై (జూన్ మొదటి వారంలో) అనేక నిర్ణయాలు తీసుకున్నాడు. మొదట పేరు మారింది. లీగ్ ఆఫ్ జస్ట్ ఇప్పుడు కమ్యూనిస్ట్ లీగ్ అయింది. నినాదం అస్పష్టమైన 'ఆల్ మెన్ ఆర్ బ్రదర్స్' నుండి 'వర్కింగ్ మెన్ ఆఫ్ ఆల్ కంట్రీస్ యునైట్- ప్రపంచ కార్మికులారా ఏకం కండి-గా మారింది. ఈ కొత్త రూపంలో యిది చరిత్రలోని తొలి అంతర్జాతీయ కమ్యూనిస్టు మరియు సంస్థ. కమ్యూనిస్టు ప్రణాళిక డ్రాఫ్టు చేసే పనిని ఎంగెల్స్, మోజెస్

" ఊహాలోకాల్లో బతకొద్దని మార్క్స్ హెచ్చరించటానికి కారణం అప్పటి ఆర్థిక, వ్యవసాయక సంక్షోభం. యూరోప్ అంతటా పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు కరవుతో అల్లాడుతున్నారు. ఫలితంగా ఎవరికోసం పని చెయ్యాలనుకుంటున్నరో, వారిని ఆకర్షించలేకపోయింది లీగ్. 1845లో ప్రారంభమైన బంగాళాదుంప తెగులు ఇతర పంటలకూ పట్టి చీడపీడలతో చిన్న రైతులు నిలువునా మునిగారు. దీనికితోడు ప్రభుత్వాలు పెద్ద రైతులకనుకూలంగా కొత్త వాణిజ్య విధానం ప్రకటించాయి. దాంతో రైతులు తమ ఉత్పత్తులను స్థానిక మార్కెట్లలో అమ్మటానికి బదులు విదేశీ మార్కెట్లకు తరలించడం ప్రారంభించారు. "

హెస్, కార్ల్ షాపర్‌లకు అప్పగించారు. దీని మొదటి ముసాయిదా, కమ్యూనిస్టులంటే ఎవరు, వాళ్ళ లక్ష్యాలు, కార్మిక చరిత్ర, విప్లవ పథ నిర్దేశం వగైరాలను ప్రశ్నలు-జవాబుల రూపంలో పొందుపరిచారు. సమావేశానికి హాజరు కాని వాళ్ల కోసం వీళ్లు ఒక సర్క్యులర్ కూడా తయారు చేశారు.

"సోదరులారా మేం ఒక అద్భుతమైన, మహత్తరమైన లక్ష్యం కోసం సమావేశమయ్యాం. విప్లవ శంఖారావమే మా నినాదం..." అంటూ సాగిందాసమావేశం. ఆ పదాడంబరం అందర్నీ ఉత్తేజితుల్ని చేసింది. ప్రపంచాన్ని మార్చటానికి బయల్దేరారు కమ్యూనిస్టు లీగ్ సభ్యులు. కాని అది పిట్ట కొంచెం కూత ఘనం కన్నా ఎక్కువేమీ కాదు. అసలు, వాళ్ల సంఖ్యే బహు స్వల్పం. ఒక బెర్లిన్ పోలీస్ అధికారి ఇచ్చిన రిపోర్టు ప్రకారం అంతా కలిసి ఎనభై నాలుగు మంది ఉన్నారు. బ్రసెల్స్‌లో ప్రారంభమైనప్పుడు పద్దెనిమిది మంది మాత్రమే ఉన్నారు. అందులో మొదటి పేరు జెన్నీదే. అందులో ఆమె సోదరుడు ఎడ్గార్, ఎంగెల్స్ కూడా ఉన్నారు గనక, ఇతర్లు పద్నాలుగు మందేనన్నమాట. 1847లో 'కమ్యూనిస్టు విప్లవ సైనికుల' పరిస్థితి అది.

బ్రసెల్స్‌లో, లీగ్‌లో వున్న వాళ్లంతా జర్మన్లు, మార్క్స్‌కు సన్నిహితులు. పైగా మార్క్స్ దానికి అధ్యక్షుడు. పెద్దగా అసమ్మతి లేదు. ఒక యిరుకు గదిలో సమావేశాలు జరిగినా అప్పటికది కమ్యూనిస్టు కేంద్రమే. ఆ రోజులను గుర్తు చేసుకుంటూ "నిబద్ధత కలిగిన గొప్ప కమ్యూనిస్టు జెన్నీ. మార్క్స్ కృషితో మమేకమై పని చేసింది. మార్క్స్ ఆమెనెంతగా ప్రేమించాడో, అతడి కార్యదీక్షను ఆమె అంతగా ఆరాధించింది" అన్నాడొక సభ్యుడు.

బ్రసెల్స్‌లో పరిస్థితులు త్వరత్వరగా మారిపోతున్నాయి. డాయిష్ బ్రసెలర్ జైటుంగ్ ప్రచురణ కర్త, మార్క్స్‌కు సర్వాధికారాలూ ఇచ్చాడు. విద్యావంతులైన కార్మికులలో చైతన్యం పెంపొందించటానికి, మార్క్స్, ఎంగెల్స్ జర్మన్ వర్కర్స్ యూనియన్ స్థాపించారు. ప్రతి బుధవారం ఒక హోటల్లో, మార్క్స్ చారిత్రక భౌతికవాదం, పెట్టుబడిదారుల దోపిడీ గురించి ఉపన్యసించాడు.

వార్తా పత్రికలలోని మార్క్స్ రాతలు పోలీసుల దృష్టిలో పడ్డాయి. ఒక అధికారి నివేదిక ప్రకారం :

"ఈ పత్రిక విష ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నది. కార్మికులు, సంపదకు హక్కుదారులని వాళ్లలో ప్రభుత్వం ధనికుల పట్ల ద్వేషం పెంచుతున్నది. వీళ్ల సంఘంలోని సభ్యుల సంఖ్య ముప్పై ఏడు నుంచి డెబ్బైకి పెరిగింది. ఇది ఆందోళన కలిగించే విషయం..."

సభ్యుల సంఖ్య త్వరలో వందకు చేరుకుంటుందని హెర్వేగ్‌కు చెప్పాడు మార్క్స్.

సెప్టెంబర్‌లో వారసత్వంగా తనకు వచ్చే వాటా గురించి మాట్లాడటానికి హాలెండ్ వెళ్లాడు మార్క్స్. 1845 నుండీ కేవలం ఒక ప్రచురణకర్త ఇచ్చిన అడ్వాన్సుతో మాత్రమే నెట్టుకొచ్చారు దంపతులు (పుస్తకం వెయ్యటం లేదు. గనుక అతను అడ్వాన్సు తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నాడు). డిసెంబర్‌లో ఒక సంవత్సరం అద్దె కట్టాలి. అదే నెలలో కమ్యూనిస్ట్ లీగ్ సమావేశానికి మార్క్స్ లండన్‌కు వెళ్లాల్సి వుంది.

కొంతకాలం క్రితం బ్రసెల్స్ వచ్చిన బకూనిన్ గొడవలు సృష్టించాడు. అతనికి మార్క్స్ అంటే పడదు. ఇప్పుడు వేట్లింగ్‌నూ, ప్రూధోనూ



అనుమానించాడని కోపం పెంచుకున్నాడు. మార్క్స్ అధ్యక్షుడిగా డెమోక్రటిక్ అసోసియేషన్‌లో బకూనిన్ సభ్యత్వమైతే తీసుకున్నాడు గాని అక్కడి క్రమశిక్షణ అతడి స్వభావానికి సరిపడదు. మార్క్స్‌నూ, ఇతరులనూ పడక్కుర్చీ విప్లవకారులని ఎద్దేవా చేశాడు. "మాటిమాటికీ బూర్జువాలంటూ నిందిస్తారు గాని వీళ్లూ బూర్జువాలే...."

హాలెండ్‌లో మార్క్స్‌కు డబ్బు దొరుకుతుందనే వాగ్దానం లభించింది గాని అప్పటికి ఖాళీ చేతుల్తోనే తిరిగి వచ్చాడు. బ్రసెల్స్ అనూహ్యమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలిసినా, లీగ్ సమావేశం యొక్క అవసరాన్ని గుర్తించి, భార్యను ఒంటరిగా వదిలి, లండన్‌కు బయల్దేరాడు మార్క్స్. ఆ సందర్భంగా పారిస్‌లో వుంటున్న పావెల్ అన్నెకోవ్‌కు ఇలా రాశాడు.

"నా ఆర్థిక స్థితి దారుణంగా వుంది. అప్పుల వాళ్లు నా భార్యను రోజూ వేధిస్తున్నారు. అడగాలంటే సిగ్గుగా వుందిగాని, నా భార్యకు వందో రెండు వందలో ఫ్రాంకులు పంపగలిగితే, నాకు మహోపకారం చేసిన వాడవవుతావు. అయితే మొత్తం నేను త్వరగా తిరిగి ఇవ్వలేను. ఆర్థిక స్థితి మెరుగుపడిన తర్వాత మాత్రమే బాకీ తీర్చగలను "

ప్రతిపాదన అంగీకరిస్తే, అన్నెకోవ్ ఆ డబ్బు జెన్నీకి పంపాలి. "నేనీ ఉత్తరం రాసిన విషయం నా భార్యకు తెలియకూడదు. మంచి వార్తలు మరోసారికి..."

నవంబర్ 27 నాడు, మార్క్స్, ఎంగెల్స్, జార్జి వీర్త్‌లు బెల్జియంలోని 'ఓస్టెండ్' నగరంలో డోవర్‌కు వెళ్లటానికి స్టీంషిప్ ఎక్కారు. అందరూ ఆ తర్వాత లండన్ చేరుకోవాలి. వివిధ సంస్థల వాళ్లు లీగ్ సమావేశం తర్వాత, నవంబర్ చివరలో అత్యంత క్రూరంగా అణచివేయబడిన పోలిష్ తిరుగుబాటును సంస్మరిస్తూ ఉత్సవాలు చేసుకోవాలనుకున్నారు. యూరోప్‌లోని రాడికల్సందరినీ ఐక్యం చేయగల అంశం పోలిష్ తిరుగుబాటు.

ఫ్రెంచి, బెల్జియన్, ఇటాలియన్, డేనిష్, ఇంగ్లిష్ సానుభూతి పరులందరూ కలిసి సోహోలోని గ్రేట్ విండ్‌మిల్ వీధిలోని ఒక హోటల్లో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.

సశేషం

▪ ఫోన్: 91776 18708

క్రిస్‌'మస్' కేక్

యాపిల్ కేక్

కావలసిన పదార్థాలు: యాపిల్ ముక్కలు-ఐదు కప్పులు (తొక్క తీసి చిన్న ముక్కలుగా కట్ చేసినవి), చక్కెర-ఒక కప్పు, బ్లాక్ రెయిసిన్స్ : ఒక కప్పు, డ్రై ఫ్రూట్స్: ఒక కప్పు, పీకాన్స్ : అరకప్పు, వెజిటబుల్ ఆయిల్ : పావు కప్పు, వెనీలా : 2 స్పూన్లు, గుడ్డు : బాగా బీట్ చేసినది ఒకటి, మిక్స్‌డ్ కేక్ ఫ్లోర్ : 21/2 కప్పులు, బేకింగ్ సోడా : 1 1/2 స్పూను, దాల్చిన చెక్క పొడి : ఒక స్పూను.

తయారు చేసే విధానం : ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో యాపిల్ ముక్కలు, చక్కెర, పీకాన్స్, రెసిన్స్ అన్నీ వేసి బాగా కలుపుకోవాలి. దీన్ని 30 నిముషాలు పక్కన పెట్టేయాలి. ఆయిల్‌లో వెనీలా, గుడ్డు వేసి కలపాలి. పిండిలో సోడా వేసి బాగా కలిపి వీటన్నిటినీ యాపిల్ మిశ్రమంలో కలిపేయాలి. అన్నిటినీ బాగా కలపాలి. ముందుగా కేక్ పాన్‌ని వేడి చేయాలి. దానిమీద కొద్దిగా వెజిటబుల్ ఆయిల్ రాసుకోవాలి. తరువాత మిశ్రమాన్ని పరిచి దానిపై జీడిపప్పు వంటివి వేసుకోవచ్చు. దీన్ని 35-40 నిమిషాల పాటు ఓవెన్‌లో పెట్టాలి. ఉష్ణోగ్రత 350 ఫారన్ హీట్ వుండేలా చూసుకోవాలి. దీన్ని సర్వ్ చేసి ముందు ఫ్రిజ్‌లో పెడితే కూల్‌గా తినడానికి బావుంటుంది.

ప్లమ్ కేక్

కావలసిన పదార్థాలు :

గుడ్లు-నాలుగు, మైదా-225 గ్రాములు, పంచదార-225 గ్రాములు, పెరుగు-225 గ్రాములు, ఖర్జూరం-అరకప్పు, కిస్‌మిస్‌లు-అరకప్పు, ఆరెంజ్ లెమన్ కాండీడ్ ఫ్రూట్ పౌడర్-ఒక టేబుల్ స్పూను, రమ్ము-మూడు టేబుల్ స్పూన్లు, జీడిపప్పు-అరకప్పు, బాదం-పది, టూటిఫ్రూటీలు-రెండు టేబుల్ స్పూన్లు, దాల్చిన చెక్క పొడి-అర టీ స్పూను, బ్లాక్ జాక్ (కేక్ రంగు మార్చడానికి వాడే పొడి-రెండు టేబుల్ స్పూన్లు.

తయారు చేయు విధానం:

రమ్ములో జీడిపప్పు, బాదం పప్పు, కిస్‌మిస్‌లు, ఖర్జూరం వేసి నానబెట్టాలి. (పది రోజుల ముందే నానపెట్టాలి) గుడ్డు సొనని బాగా గిలకొట్టాలి. ఇందులో మైదా, పెరుగు, పంచదార, ఆరెంజ్ లెమన్ కాండీడ్ ఫ్రూట్ పౌడర్, దాల్చిన చెక్క పొడి, బ్లాక్ జాక్ వేసి బాగా కలపాలి. దీన్ని బ్రెడ్ మౌల్ట్‌లో పెట్టి ఓవెన్‌లో 180 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద బేక్ చేయాలి. చివర్లో కేక్ క్రీముతో మనకి నచ్చిన డిజైన్‌లో అలంకరించుకోవాలి.

కాజు మఫిన్ కేక్

కావలసిన పదార్థాలు:

మైదా-140 గ్రా. పాలు-200 గ్రా., పెరుగు-70 గ్రా., బేకింగ్ పౌడర్-ఒక టీ స్పూను, సోడా-అర టీ స్పూను, నీళ్లు - కొద్దిగా, వెనీలా-నాలుగు చుక్కలు, జీడి పప్పులు-అరకప్పు.

తయారు చేసే విధానం :

ఒక గిన్నెలో మైదాపిండి, బేకింగ్ పౌడర్, సోడా వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇందులో జీడి పప్పులు, వెనీలా కొద్దిగా నీళ్ల, పాలు, పెరుగు కూడా వేసి బాగా కలపాలి. ఇప్పుడు మఫిన్ మౌల్డ్స్‌లో పెరుగు రాసి ఈ మిశ్రమాన్ని పెట్టాలి. ఇలా అన్నింటిని తయారు చేసుకుని, ఓవెన్‌లో 180 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఇరవై నిమిషాల పాటు బేక్ చేయాలి. కాజు మఫిన్ కేకులు రెడీ అయినట్లే.

ఫ్రూట్ కేక్

కావలసిన పదార్థాలు :

గుడ్లు-నాలుగు, మైదా-120 గ్రాములు, పంచదార-120 గ్రాములు, మిక్స్‌డ్ ఫ్రూట్ ఎసెన్స్-ఐదు చుక్కలు, పెరుగు-120 గ్రాములు, లెమన్ ఎల్లో కలర్-నాలుగు చుక్కలు.

తయారు చేసే విధానం :

గుడ్డులో తెల్లసొనని వేరు చేసి బాగా చిలకాలి. అందులో పంచదారని వేసి మళ్లీ చిలకాలి. తరువాత పచ్చసొన కూడా వేసి బాగా గిలకొట్టాలి. ఇందులో మైదా, ఎసెన్స్, లెమన్ ఎల్లో కలర్ కూడా వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. బ్రెడ్ మౌల్డ్ (ఇవి బేకరీల్లో దొరుకుతాయి)లో పెరుగు రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి. దీన్ని ఓవెన్‌లో 180 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద 25 నిమిషాల పాటు బేక్ చేయాలి. తరువాత టూటి ఫ్రూటీలతో కేక్‌ని అలంకరించుకోవాలి.

కాజు మఫిన్ కేక్


ప్లమ్ కేక్

యాపిల్ కేక్

లిటిల్ స్టార్ జవాబు : రానా, నాగ చైతన్య

వేలిముద్ర బొమ్మలు



ఏం లేదు. ఇంక్‌లో వేలు ముంచండి. పేపర్ మీద పెట్టి గట్టిగా నొక్కండి.
అంతే ముద్ర పడిపోతుంది.
దానికి మేం ఇచ్చిన బొమ్మల్లోలాగా ఆకారాలు వేస్తే చాలు.

ఎక్కడున్నాయో...



ఫ్రెండ్స్! ఐస్ బొమ్మ ఓ కార్డు పట్టుకుంది కదా. అందులో పది పదాలు దాక్కున్నాయి.
అన్నీ క్రిస్టమస్ పండుగకు సంబంధించినవే. గుర్తించండి.

ఎన్ని గుర్రాలు?



ఇక్కడ కొన్ని గుర్రాలు ఒక చోట నిలబడి పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాయా!
అయితే అవి మొత్తం ఎన్నో చెప్పకోండి చూద్దాం.

నిజమైన స్నేహం

ఒకసారి ఒక చీమ ఒక నది ఒడ్డున వెళ్తూ జారి ఆ ప్రవాహంలో పడిపోయింది. ఒడ్డుకు చేరుకోవడానికి విశ్వప్రయత్నం చేసింది. కానీ ఆ ప్రవాహ ఒరవడికి కొట్టుకుపోసాగింది. అందంతా అక్కడే చెట్టుమీద వున్న ఒక పావురం చూసి ఒక ఆకు తెంపి దాని దగ్గరగా వెళ్లి దానిముందు వదిలిపెట్టింది. ఆ చీమ అతి కష్టంమీద ఆ ఆకు మీదికి ఎక్కి అది ఒడ్డుకు చేరినపుడు తాను కూడా దిగింది. అప్పటి నుండి ఆ రెండూ మంచి స్నేహితులయ్యాయి. కలిసి మెలిసి, ఆడుతూ పాడుతూ, తింటూ తిరుగుతూ హాయిగా వుండసాగాయి.



అలా వుండగా ఒకసారి ఒక వేటగాడు అడవిలోకి వచ్చి చెట్టుమీది పావురాన్ని చూసి, దాన్ని చంపడానికి తుపాకి ఎక్కుపెట్టాడు. తన మిత్రునికి కలగబోయే ఆపదను గుర్తించిన చీమ ఆ వేటగాని కాలిమీద కుట్టింది. వాడు అబ్బా అని కిందికి చూసేటప్పటికి తుపాకి గురి తప్పింది. తుపాకి మోగిన శబ్దానికి పావురం అక్కడి నుండి ఎగిరిపోయింది.

ఆ తర్వాత చీమ, పావురం అడవి లోపల చాలా దూరంగా, సురక్షిత ప్రదేశానికి వెళ్లిపోయాయి.

మనం ఇతరులకు సాయం చేస్తే మనకు ఎవరైనా సహాయం చేస్తారు.

◆

ఆమె ఎక్కడో!

చిన్నారులూ...ఇక్కడో ఏనుగు చలాకీగా వుంది కదా.
మరి దీని యజమాని కనిపించిందా? లేదా?
అయితే మరి కనిపెట్టండీ.
తెలీకపోతే మా సమాధానం చూడండి.

జవాబు: ఏనుగు చెవి మీద కనిపించిందా!

రంగులు వేస్తే సరి

చెంచాలు చూశారా?

హాయ్...హలో...ఏం చేస్తున్నారు? చాలా బిజీగా వున్నారా? ఐతే ఒకే ఒక్క నిముషంలో చేయాల్సిన పని ఒకటి చెప్తాం. చేసేస్తారా? ఇదిగో ఈ బొమ్మలో ఓ బుజ్జి మూషికంగాడు వున్నాడుకదా. వాడి దగ్గర పది స్పూన్లు వుండాలంట. కానీ సరిగ్గా తినే సమయానికి ఒక్కటి కూడా కనిపించడంలేదని బుర్ర గోక్కుంటున్నాడు. మీరు కాస్త వెతికిపెట్టొచ్చుకదా. అదీ నిముషంలో. మరి రెడీనా. పెన్సిల్ తీసుకొని చెంచా చుట్టూ సున్నా చుట్టండే.

కనిపెట్టేస్తారా

బుజ్జాయిలూ... మీకు కొంగ, నక్క కథ తెల్సు కదా. అందులో ఒక దృశ్యం మీ ముందుంది. అది సరే. ఈ బొమ్మలో పది బొమ్మలున్నాయి. అవేంటంటారా? కొన్ని ప్రాణులు, తిండి పదార్థాలు, వస్తువులు. అవేంటో కింద వున్నాయి. వాటిని చదువుకొని బొమ్మలో గుర్తించి సున్నా చుట్టండే.

baseball cap, turtle, fish, duck, needle, nail, ice-cream cone, butterfly, boot, spoon, cane, ring, and scissors.

కాలాన్ని వెనకేసిన మనిషి

కాలాన్ని ప్రకృతిని శాసిస్తూనే వాటిని తన అధీనంలోకి తీసుకున్న మానవుని సాహసాన్ని సంఘర్షణను,ఔన్నత్యాన్ని చిత్రించే యత్నం. ఇది వైజ్ఞానిక సృజన–సృజనాత్మక విజ్ఞానం. నేను కాలాన్ని/భూత,వర్తమాన ,భవిష్యత్తులో ఆగకుండా సాగిపోయే శకటాన్ని –నేను దారాన్ని జీవపరిణామానికి ఆధారాన్ని ! నేను కాలాన్ని – మనిషి మనుగడకు మూలాన్ని! "మనిషి కాలాన్ని అధిగమించి నిలబడడం ఇప్పటి మాట' అంటూ అక్షరాన్ని కూడా శాస్త్రీయ ఆలోచనకు తీసుకొని పోయే రచయిత ప్రయత్నం ప్రశంసనీయం. మల్లరీ(శాస్త్రవేత్త) చెప్పేcuniform లిపి రహస్యాలు ఆశ్చర్యపరుస్తాయి.

"బాబిలోనియన్ల" లిపి ఎసైరియన్ లిపి, సుమేరియన్ లిపి, వంకర తిరిగిన అక్షరాన్ని"హైరోగ్లెఫిక్' అంటారు. అలాగే గణిత శాస్త్రంలో వాడే గుర్తులు, సంఖ్యలు, సూత్రీకరణాలు ఏ భాషకు సంబంధించినవి కావు. అన్ని భాషలకు ఉపయోగిస్తున్నారు.(పేజీ 42) ఉదా.male or female, sex ను వ్యక్తీకరించే గుర్తులు ఉన్నాయి. అవి ఈజియోగ్రామ్స్ . అవి ఏ ఒక్క భాషకు పరిమితం కాదు. ఇలాంటి ఆసక్తికర అంశాలతో ఈ బుక్ సాగుతుంది. పొయిట్రీలాగే కొన్ని జీవన సత్యాలు రచయిత చెప్పారు." జీవంనుండి జీవం ఉద్భవించినట్టే గింజ, గింజల్నీయడం ఒక గొప్ప జీవ ప్రక్రియ"

అలాగే"ప్రతి బీజాన్ని మొక్కగా మలచగల శక్తి ఈ భూమి తల్లికుంది" అంటారు. "నువ్వు స్త్రీవి– నువ్వు తల్లివి/ నువ్వు మరో జీవికి రూపమివ్వగలిగినట్లే/ భూదేవి కూడా ఎన్నో జీవులకు రూపమివ్వగలదని గ్రహించావు" " నువ్వు స్త్రీవి–అమ్మవి–వ్యవసాయానికి పునాదులు వేసిన దానివి– ఈపనిలో నీకు పురుషుడు తోడుంటాడు–ఇక వెళ్ళండి–మీకలల పంట పండించుకోండి" (పేజీ 49) అనే వాక్యాలు వాస్తవికతను తెలుపుతాయి. 1824 లో "కర్నాట్" థర్మోడైనమిక్‌మీద పరిశోధనాగ్రంథాన్ని వెలుగులోకి తెచ్చారు.(పేజీ 69) భూమి చుట్టూ ఉన్న స్ట్రాటో ఆవరణంలోని ఓజోన్ పొరను కావల్సిన చోట తగ్గించి శత్రుదేశాల వాతావరణంలో హానికరమైన మార్పులు చేయడానికి కూడా వెనుకాడడంలేదు. (పేజీ 78) కథలు, కవిత్వం, బాల సాహిత్యం, నవలలు, సాహిత్య విశ్లేషణలకు ధీటుగా ఈ రచయిత సైన్స్‌సంబంధిత– పర్యావరణ జనవిజ్ఞానాన్ని అన్ని వయస్సుల వారికీ అర్థం అయ్యేలా ఈ పుస్తకం రాసారు.

◆ **కొత్త పుస్తకాలు**

కాలాన్ని వెనకేసిన మనిషి
(మానవ జీవన పరిణామ పదచిత్రం)
రచన డా దేవరాజు మహారాజు,
పేజీలు: 92, వెల: 80, ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, తెలుగు బుక్‌హౌస్.
సెల్ 9908633949

రేపటి తరానికి అవసరం

1907 లో పుట్టిన కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణంగారు 1987 లో కాలం చేసారు. " మళ్ళీ జన్మంటూ వుంటే ఇక్కడే పుట్టి ఈ గ్రంథాలయ సంఘానికి ఇలాగేసేవ చేయాలని కోరుకుంటున్నాను" అన్న మహనీయుడు పాతూరి నాగభూషణంగారు. "ఆయన కదిలి వచ్చే గ్రంథాలయం" గా కరుణ శ్రీ, జంధ్యాల పాపయ్య వంటి వారు శ్లాఘించారు. జాతీయ గ్రంథాలయ సంఘాలకు కూడా సొంత భవనం లేని రోజుల్లో –భారతదేశం లో మెట్ట మెదటి గ్రంథాలయ సంఘానికి 1949లో సర్వోత్తమ భవన్ నిర్మించారు పాతూరి. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యయ పితగా గాడిచర్ల సర్వోత్తమరావుగార్ని అలాగే అయ్యంకి వెంకటరమణయ్య గార్ని పేర్కొంటారు. వారి అడుగు జాడల్లోనే 'పాతూరి' చివరి రోజు దాక సాగారు. సుందరయ్య, వావిలాల వంటి వారు నిజాయితీ, నిరాడంబరత విశిష్ట వ్యక్తిత్వాలకు ప్రతీక. పాతూరి నాగభూషణం కూడా శ్రమైక జీవనం, నిష్కల్మషమైన నిర్మల మనస్సు, స్థిరచిత్తం, సాధు వాక్కు, సేవాతత్పరణ, దేశ స్వాతంత్ర్యం గ్రంథాలయ సేవ, ప్రజాశ్రేయస్సు, ఆశయాలు–ఆకాంక్షలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తారు.అదేబాటలో వారి సంతతిని పెంచారు.

పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణ 1914 లో అఖిల భారత గ్రంథాలయ సంఘాన్ని ఏర్పరిచాడు. గ్రంథాలయోద్యమానికి పునాది వేశారు. ఈరోజు ప్రతి పల్లెలోనూ గ్రంథాలయం ఉంది. దాని వెనుక పాతూరి, అయ్యంకి, గాడిచర్ల లాంటి వారి కృషి ఎంతో ఉంది. జ్ఞాన నిధులు గ్రంథాలయాలు అని భావించిన వ్యక్తి పాతూరి. 25 అక్టోబర్ 1935 లోనే బోటులో గ్రంథాలయాన్ని నడిపిన పాతూరి కృషి నేటి తరానికి నిత్య ఆదర్శం. 1914 లో రామమోహన ధర్మ పుస్తక భాండాగారంలో చిలకమర్తి లక్ష్మీనరసింహ గారి అధ్యక్షతన సభలు .. గ్రంథాలయ సర్వస్వం పత్రిక స్థాపన (1938) వంటి విషయాల చారిత్రిక రాజకీయ సంఘటనల సమాహారం ఈ పుస్తకం.

పొట్టి శ్రీరాములుగారి లేఖ యథాతథంగా (పేజీ49) ప్రచురించి ఈ గ్రంథానికి ఎంతో విశిష్టత సంతరింపజేసారు. గ్రంథముద్రణ లో తన ప్రత్యేకతను ప్రతి పుటలో శ్రీశ్రీ ప్రింటర్స్ చూపింది. తండ్రి అప్పగించిన బాధ్యతలను కుమార్తె 'శారద' సమర్థవంతంగా నిర్వహించడం ప్రశంసనీయం. 1930–1980 దాకా గ్రంథాలయోద్యమాలు వాటి వెనకున్న ప్రముఖుల కృషిని తెలిపే పాతూరి వారి జీవిత చరిత్ర రేపటి తరానికి ఎంతో అవసరం.



సరస్వతీ పూజారి పాతూరి
(జీవిత చరిత్ర)
రచన; సన్నిధానం నరసింహాశర్మ- పి.సూర్యనారాయణ, పేజీలు: 174, వెల: 150, ప్రతులకు సర్వోత్తమ భవనం, ఇ.నెం 40-1-69-పడమట- విజయవాడ-10,
సెల్ 0866-2472313

- తంగిరాల చక్రవర్తి

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ' మీ రచనలకు ఆహ్వానం పలుకుతోంది. కథకులే కాదు! రచనల పట్ల ఆసక్తి వున్న, శక్తి వున్న వారెవరైనా మీ కలాలను కదిలించి రకరకాల అంశాలను పంపవచ్చు. మీ సమీప ప్రాంతాలలో నెలకొన్న దర్శనీయ స్థలాలు, మీరు చూసొచ్చిన పర్యాటక ప్రదేశాల గురించి రాయవచ్చు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రికార్డులు సృష్టించిన, అవార్డులు పొందిన కళాకారులు, క్రీడాకారులు, చిత్రకారులు, సినీరంగానికి చెందినవారి గురించి రాసి పంపవచ్చు. రచన స్థాయిని బట్టి పారితోషికం వుంటుంది.

-ఎడిటర్.

చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020. మెయిల్ : snehaweekly.praja@gmail.com

నేతలు మెచ్చిన వంట

ప్రముఖుల జీవితాలెప్పుడూ ఆసక్తికరంగానే వుంటాయి. వారి ప్రయివేటు విషయాలు తెల్సుకోవాలన్న ఉత్సుకత సామాన్యులకు సహజంగానే ఉంటుంది. వారికి ఏదంటే ఇష్టం? ఏది నచ్చుతుంది? ఏది నచ్చదు? ఏం తింటారు? ఏం తినరు? అబ్బో... ఇలాంటివెన్నో. దేశాధినేతల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది.

జర్మనీ నేత అడాల్ఫ్ హిట్లర్ గారు భోజనం చేయాలంటే....సింగిల్‌గా ఎప్పుడూ తినరు. చుట్టూ జనం వుండాల్సిందే. వారు తిన్నాక... సరిగ్గా నలభై అయిదు నిముషాల అనంతరం సార్ తింటారు. అదీ ముందు తిన్నవారు ఆరోగ్యంగా ఉన్నారనుకుంటేనే. ఆయన శాఖాహారి అని అందరం అనుకుంటాం. కానీ ఆయనకు పక్షి మాంసం అంటే ఇష్టమట. ఇటలీ నేత ముస్సోలినీకి ఇటాలియన్ ఫుడ్ అంటే ఇష్టం. ఒంటె మాంసం అంటే మహా ఇష్టం. ఇక ఇరాక్ నేత సద్దాం హుస్సేన్ తాజా చేపల వేపుడు వుంటే లొట్టలేసుకుంటూ లాగించేసేవారట. లిబియా పాలకుడు గడాఫీకి ఒంటెపాలంటే ఇష్టం. వాటి వల్ల దంత సిరి బావుంటుందని ఆయన అభిప్రాయం. అంతేకాకుండా ఆయనకు ఒంటె మాంసం అన్నా చెప్పలేనంత ప్రియం. ఉత్తర కొరియా నేత కిమ్ జంగ్ -2కి షార్క్ సూప్ అంటే అభిమానమట. ఇవన్నీ 'డిక్టేటర్స్ డిన్నర్స్' అనే పుస్తకంలో రచయితలు విక్టోరియా క్లార్క్, మిలెస్సా స్కాట్ చెప్పిన విషయాలు.

సజీవ శిల్పాలు

కూటి కోసం కోటి విద్యలు. ఇది పెద్దలు ఏనాడో చెప్పిన మాట. మన ముందుకొొచ్చిన వారిది కూడా అదే మాట. 'ఓసోస్...మన దగ్గర కూడా కొంత మంది స్వామీజీలు ఇదే పద్ధతుల్లో కూర్చుని ధ్యానం చేస్తుంటారు కదా' అనుకోవచ్చు. అయితే వారు వూరకనే కూర్చుంటారా! తమ దగ్గర శక్తులున్నాయని మాయమాటలు చెప్పి జనాన్ని మోసం చేస్తుంటారు. అందుకే అందులో వున్న గుట్టు విప్పి.. అసలు విషయం చెప్పేందుకు..

జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు కూడా అలా ... చేసి చూపిస్తుంటారు. అయితే ఇవాళ మన ముందుకొొచ్చిన వారంతా విదేశీయులు. విదేశాల్లో ఇలా కదలక మెదలక కూర్చుని సందర్శకులు ఇచ్చిన పైసలు తీసుకుని పొట్టపోసుకుంటూ వుంటారు. ఇదంతా ఎంత కష్టమనుకున్నారు! గంటల తరబడి మేకప్ వేసుకుని కన్నార్పకుండా అలా నిలబడడం చాలా కష్టం. పైగా కొందరు కొంటెకోనంగులు విసిగిస్తుంటారట. చేతిలో వున్న కర్రలు లాగడం, టోపీ తీసేయడం... వంటివి చేసే వారికీ కొదవ లేదు. అన్నీ తట్టుకుని ... ఓపిగ్గా కదలకుండా నిలబడుతుంటారు. ఏదోలెండి! బతుకు బండి లాగడానికి వారి తిప్పలు వారివి.   ఏది ఏమైనా ఈ సజీవ శిల్పాల సహనాన్ని తప్పక అభినందించాలి మనం.